



వైభవంగా
## యాద'గిరి' ప్రదక్షిణ
- నృసింహుడికి స్వాతి నక్షత్ర పూజలు
- భారీగా తరలివచ్చిన భక్తులు

5




# స్థానిక సమరానికి రెడీ

పంచాయతీ ఎన్నికలు జనవరిలో నిర్వహించేందుకు ప్రభుత్వం సిద్ధమవుతుండడంతో గ్రామాల్లో సందడి నెలకొంది. తొలుత పంచాయతీలు, ఆతర్వాత మండల, జిల్లా పరిషత్ పాలకవర్గాలకు ఎన్నికల నిర్వహణపై ప్రభుత్వం కసరత్తు ప్రారంభించడంతో ఆశావహుల్లో ఆనందం కనిపిస్తోంది. పది నెలలుగా పంచాయతీలకు, ఆరు నెలలుగా పరిషత్‌లకు పాలకవర్గాలు లేకపోవడంతో పాలన ప్రత్యేకాధికారుల చేతుల్లోకి వెళ్లింది.

- (ఆంధ్రజ్యోతిప్రతినిధి,నల్లగొండ)

- గ్రామాల్లో ఆశావహుల సందడి
- రిజర్వేషన్ల కోసం ఎదురుచూపు
- జనవరిలో షెడ్యూల్ వస్తుందనే సమాచారంతో నాయకుల్లో ఉత్సాహం

పంచాయతీల పాలకవర్గాల గడువు తీరడంతో కేంద్ర ప్రభుత్వం నుంచి నేరుగా వచ్చే నిధులు నిలిచాయి. పాలకవర్గాలు ఉంటేనే కేంద్రం నిధులను విడుదల చేస్తుంది. దీంతో ప్రస్తుతం పల్లెల్లో అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలకు కేంద్రంనుంచి నిధుల విడుదలకు బ్రేకులు పడ్డాయి. జనవరిలో సంక్రాంతి పర్వదినం తరువాత పంచాయతీ ఎన్నికల షెడ్యూల్ విడుదలచేసేలా రాష్ట్ర ఎన్నికల సంఘం కసరత్తు చేస్తుండడంతో ఆశావహులు పరుగులు పెడుతున్నారు. ఉమ్మడి జిల్లాలోని మూడు జిల్లా పరిషత్‌లు, 73 జడ్పీటీసీ స్థానాలు, 73 మండల పరిషత్‌లు,1,740గ్రామపంచాయతీలు ఉన్నాయి. తొలుత పంచాయతీ పాలకవర్గాలకు ఎన్నికలు నిర్వహించేందుకు ప్రభుత్వం సిద్ధమవుతున్న నేపథ్యంలో రాజకీయ సందడి మొదలైంది.

***రిజర్వేషన్లపై ఉత్కంఠ***

బీసీలకు రిజర్వేషన్ పెంచుతామని శాసనసభ ఎన్నికలకు ముందు కాంగ్రెస్ హామీ ఇచ్చింది. అయితే సుప్రీం కోర్టు తీర్పు ప్రకారం మొత్తం రిజర్వేషన్లు 50శాతం మించకూడదు. దీంతో బీసీ రిజర్వేషన్లను తేల్చేందుకు రాష్ట్ర ప్రభుత్వం రిటైర్డ్ ఐఏఎస్ అధికారి నేతృత్వంలో డెడికేటెడ్ కమిషన్‌ను ఏర్పాటుచేసింది. ఈ కమిషన్ డిసెంబరు 10వ తేదీలోగా ప్రభుత్వానికి నివేదిక సమర్పించనుంది. ఈ నివేదిక వచ్చాక బీసీ రిజర్వేషన్లపై రాష్ట్ర ప్రభుత్వ వైఖరి తేలనుంది. దీని ప్రకారం బీసీ రిజర్వేషన్లు పెంచి ఎన్నికలు నిర్వహిస్తారా? లేక సుప్రీం కోర్టు నిబంధనలకు కట్టుబడి అధికారికంగా 50శాతం లోపు రిజర్వేషన్లు ప్రకటించి, పార్టీ నుంచి మాత్రం బీసీలకు ఆ కమిషన్ నిర్దేశిత కోటామేరకు రిజర్వేషన్లు కల్పిస్తారా? అనే విషయం తేలాల్సి ఉంది. డిసెంబరు నెలాఖరులోగా రిజర్వేషన్లపై తేల్చి, సంక్రాంతి నాటికి ఎన్నికల షెడ్యూల్ ప్రకటిస్తారనే చర్చ సాగుతోంది. రిజర్వేషన్ల అంశం తేలితే తప్ప పంచాయతీల ఎన్నికలు ముందుకు సాగని పరిస్థితి నెలకొంది.



***రంగం సిద్ధం చేసుకుంటున్న ఔత్సాహికులు***

గ్రామపంచాయతీ సర్పంచ్‌లుగా పోటీచేసేందుకు పలువురు ఔత్సాహిక నాయకులు ఇప్పటికే రంగం సిద్ధం చేసుకున్నారు. గ్రామాల్లో ఇప్పటికే ఆశావహులు పెళ్లిళ్లకు, చావులకు విధిగా హాజరవుతున్నారు. అదేవిధంగా యువతకు స్పోర్ట్స్ కిట్స్, క్రికెట్ కిట్స్ అందిస్తున్నారు. ట్రస్టులు, సేవాసంస్థల ద్వారా కార్యక్రమాలు ముమ్మరం చేశారు. ఎమ్మెల్యేలు, మాజీ ఎమ్మెల్యేలను తీసుకువచ్చిన ప్రదర్శనలు, కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. సర్పంచ్ పదవికి పోటీచేయాలని భావిస్తున్న నాయకులు వినాయకచవితి నుంచే ఖర్చును ప్రారంభించారు. గణపతి మండపాల ఏర్పాటుకు, వినాయక విగ్రహాలకు, అన్నదానాలకు ఆర్థికంగా సాయం చేశారు. ఎవరైనా మృతిచెందితే వారి కుటుంబాలను పరామర్శించడంతోపాటు తోచిన రీతిలో ఆర్థిక సాయంచేస్తూ వచ్చారు. పార్టీ కార్యక్రమాలకు కార్యకర్తలను తీసుకెళ్తూ వారిని సంతృప్తి పరుస్తున్నారు. తెల్లచొక్కా, తెల్లప్యాంటు వేసుకొని గ్రామంలో తిరుగుతూ కనబడ్డవారికి నమస్కరిస్తూ కుశల ప్రశ్నలు వేస్తున్నారు. కార్యాలయాల్లో పనులను దగ్గరుండి చేయించిపెడుతున్నారు. మరికొన్ని చోట్ల ఔత్సాహికులు యువతకు పార్టీలిస్తుంటే, కొన్నిచోట్ల నాయకులు మహిళలకు కోలాటాలు, భజన కార్యక్రమాలకు శిక్షణ ఇప్పిస్తున్నారు. ఇలా ఎక్కడ అవకాశముంటే అక్కడ సేవా కార్యక్రమాలు నిర్వహిస్తూ నిత్యం జనంలో ఉండేలా చూసుకుంటున్నారు. శివ, దత్తాత్రేయ

- మిగతా 4వ పేజీలో...



# బియ్యం సన్నవే.. వండాకే దొడ్డవుతోంది

- నాణ్యతపైనే అనుమానాలు
- అధికారులు, ఏజెన్సీ నిర్వాహకుల భిన్న వాదనలు
- అర్ధాకలితో అలమటిస్తున్న విద్యార్థులు

భువనగిరి టౌన్, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి): మెత్తటి అన్నం, కలుషిత ఆహారం నేడు విద్యారంగానికి తలనొప్పిగా మారిన ప్రధాన అంశాలు. రాష్ట్రంలో ఎక్కడో ఒకచోట ప్రతిరోజూ ఇలాంటి ఘటనలు వెలుగు చూస్తున్నాయి. అలాగే ఉమ్మడి జిల్లాలోనూ ఈ తరహా సన్నివేశాలు నిత్యకృత్యమవుతున్నాయి. ఉన్నత భవిష్యత్, చదువుపై మమకారంతో వేలాదిమంది విద్యార్థులు తల్లిదండ్రులు, కుటుంబ సభ్యులకు దూరంగా ఉంటూ ఆశ్రమ పాఠశాలలు, హాస్టళ్లలో ఉంటూ చదువుకుంటున్నారు. ఈ తరహా విద్యార్థుల్లో పేదలే అధికంగా ఉన్నారు. అయితే చదువు ఎలా ఉన్నప్పటికీ ఆకలి తీర్చే అన్నం మాత్రం విద్యార్థులకు పరీక్షగా మారుతోంది. కొన్ని హాస్టళ్లు, పాఠశాలల్లో ఉడికీ ఉడకని అన్నం వడ్డిస్తుండగా మరికొన్నింటిలో మెత్తటి అన్నంతోనే విద్యార్థులు సరిపెట్టుకోవాల్సి వస్తోంది. కాగా గతంలో కూరలు, సాంబార్‌పైనే అధిక ఫిర్యాదులు ఉండగా ప్రస్తుతం అందుకు భిన్నంగా వాటి ప్రస్తావన లేకుండానే కేవలం అన్నంపై మాత్రమే ఫిర్యాదులు వెల్లువెత్తుతుండడం గమనార్హం. ఈ తంతులో కీలకంగా మారిన బియ్యం నాణ్యతపైన అనుమానాలు తలెత్తుతున్నాయి. కానీ ప్రభుత్వం సరఫరా చేస్తున్న బియ్యం నాణ్యతపై అధికారులు, అన్నం వండే ఏజెన్సీల మధ్య భిన్న వాదనలు తలెత్తుతున్నాయి. వాస్తవం ఏదైనప్పటికీ విద్యార్థులు మాత్రం అర్ధాకలితో ఉండాల్సిన పరిస్థితులు నెలకొన్నాయనేది మాత్రం వాస్తవం.

***బియ్యం నాణ్యతే ప్రధాన అంశం***

ప్రభుత్వ పాఠశాలల్లో మధ్యాహ్న భోజనం, గురుకులాలు, హాస్టళ్లు, అంగన్‌వాడీ కేంద్రాల్లో వడ్డిస్తున్న భోజనంలో బియ్యం నాణ్యత ప్రధాన అంశంగా చర్చ సాగుతోంది. గతంలో దొడ్డు అన్నాన్నే లబ్ధిదారులకు అందించే వారు, కానీ ప్రభుత్వ నిర్ణయం కారణంగా కొంతకాలంగా అందరికీ సన్న బియ్యంతో భోజనం లభిస్తోంది. సన్న అన్నంతోపాటు వివాదాలు కూడా వెంటాడుతున్నాయి. బియ్యం నాణ్యతపై అధికారులు, అన్నం వండే ఏజెన్సీల మధ్య భిన్న వాదనలు తలెత్తుతున్నాయి. నాణ్యతలేని, దొడ్డు బియ్యాన్ని పాలిష్ చేసిన బియ్యం సరఫరా అవుతుండడంతో అన్నం నాణ్యత కోల్పోతోందని ఏజెన్సీలు అంటున్నాయి. కానీ అధికారులు మాత్రం దొడ్డు బియ్యాన్ని పాలిష్ చేసే టెక్నాలజీ లేనేలేదని, ఈ పదమే అసత్యమని ఖండిస్తున్నారు. లబ్ధిదారులకు సన్న అన్నం పెట్టే లక్ష్యంతో ఈ సీజన్‌లో సాగైన సన్న బియ్యాన్ని సరఫరా చేస్తున్నామని, కానీ వాటిని

- మిగతా 5వ పేజీలో

# నిర్లక్ష్యం వహిస్తే కఠిన చర్యలు

కలెక్టర్ హనుమంతరావు




సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ హనుమంతరావు

భువనగిరి అర్బన్, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ వసతిగృహాల్లో చదివే విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించడంలో నిర్లక్ష్యం వహిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని కలెక్టర్ ఆదేశించారు. కలెక్టరేట్‌లో శుక్రవారం గురుకుల, ప్రభుత్వ వసతి గృహాల వార్డెన్లతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రభుత్వ వసతి గృహాలు, గురుకుల పాఠశాల విద్యార్థులకు అందించే భోజనం నాణ్యత ప్రమాణాలతో ఉండాలన్నారు. నిత్యం వడ్డించే ఆహారం శుచి, శుభ్రత ఉండేవిధంగా వంట సిబ్బంది, వారి సహాయకులు పాటించాలన్నారు. ఎలాంటి అలసత్వం వహించినా చర్యలు తప్పవని హెచ్చరించారు. వంట చేసేందుకు సేకరించే కూరగాయలు, ఆకుకూరలు, నూనె,పిండి, పప్పులు తదితర ఆహార పదార్థాలు శుభ్రంగా ఉండేట్లు చూడాలన్నారు. నిల్వ చేసే కూరగాయలను గాలి, వెలుతురు ఉండే ప్రాంతంలో భద్రపర్చాలన్నారు. వంట కార్మికులు పరిశ్రభతను పాటించాలన్నారు. వంట చేసే సామగ్రిని ఎప్పటికప్పుడు తనిఖీ చేయాలన్నారు. ఈగలు, దోమలు, బొద్దింకలు లేకుండా వంట గది, భోజనశాలను శుభ్రం చేసుకోవాలన్నారు. విద్యార్థులకు అన్నం వడ్డించేటప్పుడు తలకు వస్త్రం (టోపి), చేతులకు గ్లౌజులు వేసుకొని కాళ్లు, చేతుల గోళ్లు ఉండకూడదన్నారు. సమావేశంలో రెవెన్యూ అదనపు కలెక్టర్ జి.వీరారెడ్డి, స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ కే.గంగాధర్, జిల్లా వైద్యాధికారి మనోహర్, అసిస్టెంట్ ఫుడ్ కంట్రోల్ అధికారి జ్యోతిర్మయి, ఫుడ్ సేఫ్టీ అధికారి ఎం.సుమన్‌కల్యాణ్, స్వాతి తదితరులు పాల్గొన్నారు.

***'రైతు పండుగ'కు సీఎం సందేశం***

రైతు పండుగలో భాగంగా శనివారం ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి సందేశం ఇవ్వనున్నట్లు కలెక్టర్ హనుమంతరావు తెలిపారు. కలెక్టరేట్‌లో శుక్రవారం ఆయన మాట్లాడుతూ రైతు పండుగ కార్యక్రమంలో వివిధ అంశాలపై అవగాహన కల్పించేందుకు ప్రదర్శనలు, శిక్షణా కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు చెప్పారు. జిల్లాలోని ఒక్కో రైతు వేదికలో 100మంది రైతులు పాల్గొనేలా చర్యలు చేపట్టాలన్నారు. దృశ్య, శ్రవణ మాధ్యమాల ద్వారా రైతులు వీక్షించేందుకు ఏర్పాటు పూర్తి చేశామన్నారు.

***గ్రామీణ పాఠశాలలను దత్తత తీసుకోవాలి***

భువనగిరి టౌన్: రోటరీ క్లబ్ తదితర స్వచ్ఛంద సంస్థలు ప్రభుత్వ గ్రామీణ పాఠశాలలను దత్తత తీసుకొని అభివృద్ధి చేయాలని కలెక్టర్ హనుమంతరావు అన్నారు. రోటరీక్లబ్ సభ్యుడు జూలూరు కృష్ణమూర్తి సమకూర్చిన సైకిళ్లను భువనగిరి రోటరీక్లబ్ ఆధ్వర్యంలో శుక్రవారం భువనగిరిలో ఆయన ప్రభుత్వ పాఠశాలల విద్యార్థినులకు పంపిణీ చేసి మాట్లాడారు. విద్యార్థులను ప్రోత్సహిస్తే భవిష్యత్‌లో దేశానికి ఉత్తమ ఫలితాలు వస్తాయన్నారు. రోటరీక్లబ్ జిల్లా గవర్నర్ శరత్‌బాబు మాట్లాడుతూ స్వచ్ఛంద సేవా కార్యక్రమాలకు రోటరీక్లబ్ అతిపెద్ద ప్లాట్‌ఫామ్ అన్నారు. 50 మంది బాలికలకు సైకిళ్లను అందజేశారు. కార్యక్రమంలో క్లబ్ అధ్యక్ష, కార్యదర్శులు కరిపే నర్సింగరావు, కె.సత్యనారాయణరెడ్డి, డిప్యూటీ గవర్నర్ ఎస్.నర్సింహయాదవ్, అసిస్టెంట్ గవర్నర్లు శెట్టి బాలయ్యయాదవ్, వై.వెంకట్‌రెడ్డి, ప్రిన్సిపల్ పాపిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించాలి

*గోదాం నుంచి నాణ్యమైన బియ్యం అందిస్తాం: అదనపు కలెక్టర్ వీరారెడ్డి*



పాఠశాలలో మధ్యాహ్న భోజన బియ్యాన్ని పరిశీలిస్తున్న అదనపు కలెక్టర్ వీరారెడ్డి

మోత్కూరు, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి): పాఠశాలలో విద్యార్థులకు మధ్యాహ్న భోజనం ముద్దలు కాకుంగా జాగ్రత్తగా వండి, మెనూ ప్రకారం నాణ్యమైన భోజనం అందించాలని అదనపు కలెక్టర్ బి.వీరారెడ్డి, పౌర సరఫరాల సంస్థ జిల్లా మేనేజరు ఎం.జగదీష్‌కుమార్ వంట ఏజెన్సీ నిర్వాహకులను, వంటలను పర్యవేక్షించే ఉపాధ్యాయులను ఆదేశించారు. మోత్కూరు జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాలలో మధ్యాహ్న భోజనం ముద్దముద్ద అయి విద్యార్థులు తినలేక పడేసి, పస్తులు ఉండటంపై 'మధ్యాహ్న భోజనం ముద్దముద్ద' శీర్షిక ఆంధ్రజ్యోతి మెయిన్‌లో శుక్రవారం ప్రచురించిన కథనానికి వారు స్పందించి శుక్రవారం మోత్కూరు పాఠశాలను వారు సందర్శించి విచారణ జరిపారు. అధికారులు మంచి బియ్యం అందించకపోవడంతో అన్నం ముద్దగా మారిందని వంట ఏజెన్సీ నిర్వాహకురాలు విజయ అధికారులకు చెప్పారు. తాము బియ్యం బాగా లేవని చెప్పినా అధికారులు పట్టించుకోవడం లేదన్నారు. బియ్యం కడుగుతుంటేనే విరిగిపోతున్నాయని వారు అధికారుల దృష్టికి తెచ్చారు. అదనపు కలెక్టర్ వీరారెడ్డి బియ్యాన్ని పరిశీలించి ఈ సన్న బియ్యం నిజామాబాదు నుంచి సరఫరా అయ్యాయని, వీటి నాణ్యత కొంత తక్కువగానే ఉందని, పాఠశాలలకు, హాస్టళ్లకు మంచి బియ్యం సరఫరా చేసేలా చర్యలు తీసుకుంటామన్నారు. అనంతరం మోత్కూరు బియ్యం గోదాంను పరిశీలించారు. పాఠశాలలో ముద్ద అయిన బియ్యాన్ని గోదాంకు పంపించి వేరే బియ్యం తెప్పించారు. పదవ తరగతికి వెళ్లి విద్యార్థుల చేత హిందీ పాఠం చదించారు. మంచి, చెడులపై, సామాజిక అంశాలపై కొంత సేపు విద్యార్థులకు అవగాహన కల్పించారు. తహసీల్దార్ డి.రాంప్రసాద్, మండల ప్రత్యేక అధికారి బి.యాదయ్య, హెచ్ఎం టి.గోపాల్‌రెడ్డి తదితరులు వారి వెంట ఉన్నారు.

## వ్యాసక్టమికి పురుషులు సుముఖత చూపాలి

*డీఎంహెచ్‌వో మనోహర్*



సమావేశంలో మాట్లాడుతున్న డీఎంహెచ్‌వో

భువనగిరి టౌన్, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి): కుటుంబ నియంత్రణకు పురుషులు వ్యాసక్టమి శస్త్ర చికిత్సలకు సుముఖత చూపాలని డీఎంహెచ్‌వో మనోహర్ అన్నారు. శుక్రవారం భువనగిరిలో నిర్వహించిన వ్యాసక్టమి పక్షోత్సవాల అవగహన సమావేశంలో ఆయన మాట్లాడారు. భార్య అనారోగ్యంగా ఉన్నప్పుడు కుటుంబ నియంత్రణకు భర్త వ్యాసక్టమి చేయించుకోవడం బాధ్యత అన్నారు. వ్యాసక్టమి పక్షోత్సవాలను విజయవంతం చేయాలని, డిసెంబరు 3, 4వ తేదీల్లో నిర్వహిస్తున్న అవగహన సదస్సులో పురుషులు పాల్గొనాలన్నారు. ఏడాది కాలంగా జిల్లాలో ఒక్క వ్యాసక్టమి శస్త్ర చికిత్స కూడా జరగలేదన్నారు. పక్షోత్సవాల నిర్వహణపై అవగాహన కల్పించారు. సమావేశంలో డిప్యూటీ డీఎంహెచ్‌వో యశోద, వైద్యాధికారులు వీణ, రామకృష్ణారావు, తదితరులు పాల్గొన్నారు.

పల్లె దవాఖానాల్లో
## వసతుల లేమి
- అసంపూర్తిగా నిలిచిన భవన నిర్మాణాలు

6

# తెలంగాణను కాపాడుకునేందుకు పోరాటం

- స్థానిక సంస్థల ఎన్నికల్లో సత్తా చాటేందుకు పార్టీ శ్రేణులు సిద్ధంకావాలి
- ఎమ్మెల్సీ శ్రీనివాస్‌రెడ్డి
- ఉత్సాహంగా దీక్షా దివస్




దీక్షా దివస్‌లో మాట్లాడుతున్న ఎమ్మెల్సీ శ్రీనివాస్‌రెడ్డి

భువనగిరి టౌన్, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి): కేసీఆర్ నేతృత్వంలో మరోమారు కాంగ్రెస్ దుష్టపాలనపై పోరాడేందుకు బీఆర్ఎస్ శ్రేణుల సిద్ధం కావాలని ఆ పార్టీ ఎమ్మెల్సీ, దీక్షా దివస్ జిల్లా ఇన్‌చార్జి పోచంపల్లి శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. శుక్రవారం భువనగిరిలో నిర్వహించిన బీఆర్ఎస్ దీక్షా దివస్‌లో ఆయన మాట్లాడారు. 2009, నవంబరు 9న కేసీఆర్ చేపట్టిన ఆమరణ దీక్ష ఫలితంగానే అప్పటి కేంద్రంలోని కాంగ్రెస్ ప్రభుత్వం డిసెంబరు 9న తెలంగాణ ఏర్పాటుపై అనుకూల ప్రకటన చేసిందని, కానీ ఆంధ్ర నాయకులనుంచి వచ్చిన ఒత్తిడితో మరుసటి రోజే ప్రకటనను ఉపసంహరించుకున్నదని ఆరోపించారు. అయినప్పటికీ కేసీఆర్ సాగించిన పోరాటాల ఫలితంగా తప్పని పరిస్థితుల్లో కాంగ్రెస్ ప్రభుత్వం 2014లో తెలంగాణను ఇచ్చిందని గుర్తుచేశారు. అయితే పదేళ్ల పాలనలో కేసీఆర్ తీర్చిదిద్దిన బంగారు తెలంగాణను నేటి కాంగ్రెస్ ప్రభుత్వం విధ్వంసం చేస్తోందని విమర్శించారు. ఏపీ సీఎం చంద్రబాబు డైరెక్షన్‌లోనే తెలంగాణ సీఎం రేవంత్‌రెడ్డి రాష్ట్రాన్ని పాలిస్తున్నారని విమర్శించారు. బీఆర్ఎస్ కార్యకర్తలు కేసులకు భయపడరని, వారి ఒంటినిండా ఉద్యమస్ఫూర్తి ఉందన్నారు. త్వరలో జరగనున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో సత్తాచాటేందుకు నాయకులు,కార్యకర్తలు సిద్ధం కావాలన్నారు.

***పార్టీని వీడిన వాళ్లంతా మోసగాళ్లు : కంచర్ల***

బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు కంచర్ల రామకృష్ణారెడ్డి మాట్లాడుతూ పదేళ్లపాటు పదవులు అనుభవించి ఎన్నికల్లో ఓడిన వెంటనే పార్టీని వీడిన నాయకులందరూ మోసగాళ్లని, వారందరికీ పార్టీ కార్యకర్తల ఉసురు తగులుతుందన్నారు. మాజీ ఎమ్మెల్యేలు పైళ్ల శేఖర్‌రెడ్డి, గొంగిడి సునీత మహేందర్‌రెడ్డి, కూసుకుంట్ల ప్రభాకర్‌రెడ్డి మాట్లాడుతూ కేవలం కేసీఆర్ రగిలించిన ఉద్యమాలతోనే తెలంగాణ రాష్ట్రం ఆవిర్భవించిందని, అదే స్ఫూర్తితో నేటి మోసపూరిత కాంగ్రెస్ పాలనపై పోరాడుదామని, ఇందుకు త్వరలో జరగనున్న స్థానిక సంస్థల ఎన్నికలను వేదికగా మలుచుకోవాలన్నారు.

ముందుగా అమరవీరుల స్మారకస్థూపం వద్ద నివాళులర్పించారు. కార్యక్రమంలో పార్టీ రాష్ట్ర నాయకులు చింతల వెంకటేశ్వర్‌రెడ్డి, గొంగిడి మహేందర్‌రెడ్డి, జిల్లా రైతుబంధు, మునిసిపల్ మాజీ చైర్మన్లు కొలుపుల అమరేందర్, ఎనబోయిన ఆంజనేయులు, బీఆర్ఎస్ పట్టణ, మండల అధ్యక్ష కార్యదర్శులు ఏవి కిరణ్‌కుమార్, జనగాం పాండు, రచ్చ శ్రీనివాస్‌రెడ్డి, మా జీ ఎంపీపీలు, మాజీ జడ్పీటీసీలు, నాయకులు కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# ఆడుదాం.. కోలాటం

- కోలాట ప్రదర్శనతో మహిళల్లో మానసిక ఉల్లాసం
- సంప్రదాయ కళను నేర్చుకునేందుకు ఆసక్తి చూపుతున్న మహిళలు
- జిల్లాలో కోలాటానికి పెరుగుతున్న డిమాండ్

**కోలాట కళకు రోజు రోజుకూ ఆదరణ పెరుగుతోంది. ఈ ప్రాచీన కళను నేర్చుకునేందుకు మహిళలు ఆసక్తి చూపిస్తున్నారు. మహిళలంతా ఒక గ్రూపుగా ఏర్పడి నేర్చుకునేందుకు ఆసక్తి చూపిస్తున్నారు. గురువు పర్యవేక్షణలో 45 రోజుల పాటు కోలాటం శిక్షణ పొందుతున్నారు. దీంతో కోలాట ప్రదర్శనకు విపరీతమైన డిమాండ్ పెరిగింది. ప్రధానంగా ఆధ్యాత్మిక కార్యక్రమాల్లో కోలాట ప్రదర్శన ఉండాల్సిందే. వివిధ కోలాట ప్రదర్శనలతో ప్రజల్లో ఉత్సాహం నింపుతున్నారు. కొన్నిసందర్భాల్లో డబ్బులు ఇచ్చి సైతం కోలాటం ప్రదర్శనను ఏర్పాటు చేసుకుంటున్నారు.**

(ఆంధ్రజ్యోతి-నల్లగొండ /నల్లగొండ క్రైం)



భారతీయ సంస్కృతిలో భాగమైన కోలాట కళకు గతంలో ఎంతో ఆదరణ ఉండేది. రానురాను ఆ కళ అంతరించిపోయి ఎక్కడో ఒక చోట అరుదుగా కనిపించేంది. అయితే ఈ కళపై మహిళల్లో ఉన్న ఆసక్తిని గుర్తించిన కొందరు కళకు పునర్జీవం పోసేందుకు శిక్షణ ప్రారంభించారు. కోలాట ప్రదర్శన యువత, మహిళల్లో నూతనోత్సాహాన్ని ఇవ్వడంతో ఆసక్తిని పెంచుకున్నారు.

### మానసిక ప్రశాంతత

శారీరకమైన రుగ్మతులు తొలిగిపోవడం మానసిక ప్రశాంతత నెలకొంటుంది. దీనికితోడు కలిసికట్టుగా ప్రదర్శనలివ్వడం ద్వారా తోటివారితో స్నేహభావం పెరుగుతోంది. భక్తిగీతాలను ఆలపిస్తూ గంటకు పైగానే కోలాటం ప్రదర్శన చేస్తున్నారు. భక్తి గీతాలతో పాటు జానపద, తెలంగాణ పాటలకు మహి ళలు లయబద్ధంగా ప్రదర్శనలిస్తూ ఉత్సాహంతో సాగుతున్నారు.

### జడకొప్పుల కోలాటం

జడకొప్పుల కోలాటం ప్రత్యేక ఆకర్షణగా నిలుస్తోంది. ఈ కోలాటంలో ఎత్తయిన పందిరి దాని పైగాన చక్రం, దానికి వేలాడేలా కొత్త చీరలు, అవి పట్టుకుని జడవేసే వాళ్లు. 16 మంది కళాకారులతో పాటు తబల, తాళం, గాయకులతో పాటు మొత్తం 30 మంది ఆడి పాడే జడకొప్పుల ఆట. మధ్య మధ్యలో ఉల్లాసాన్ని నవ్వులను పూయించే విధంగా గీతాలతో కళాకారులలో మరింత ఉత్సాహాన్ని నింపుతుంది. ఈ ఆట కష్టాలను మైమరిచి ధనిక, పేద, చిన్నాపెద్ద అనే తేడా లేకుండా ఉల్లాస భరితంగా ప్రదర్శిస్తూ వారిలో సోదరభావాన్ని పెంపొందిస్తుంది. దశాబ్దాలుగా వస్తున్న ఈ అరుదైన కళను నేటి తరం యువత, ఉద్యోగులు, మహిళలు ఆటలో అందిపుచ్చుకోవడం ప్రాచీన కళ పట్ల ఆసక్తికి ప్రతిబింబంగా నిలుస్తోంది. కళాకారులు రంగు, రంగుల చీరలు, కాళ్లకు గజ్జెలు కట్టి లయబద్ధంగా నర్తించే విధంగా జడకొప్పుల ఆట ప్రదర్శనలో ముందుకు సాగుతారు.

●కోలాటంలో పలు రకాల ప్రద ర్శనలు ఉన్నాయి.అందులో జడకొప్పు కోలాటం ప్రత్యేకమైనది. భారత కో లాటం, జానపద కోలాటం, సాంస్కృతిక కోలాటం, నృత్య రూపక కోలా టం, శ్రీకృష్ణ కోలాటం, హరే రామ కృష్ణ కోలాటం,ప్రాచీన కోలాటం, కష్టసుఖాల కోలాటం, ఆంధ్ర కోలాటంతో పాటు వివిధ రకాల కోలాటాలను మహిళలు నేర్చుకుంటున్నారు.

### కోలాటంతో మానసిక ఉల్లాసం



కోలాట ఆటలో శిక్షణ పొందుతున్నా. గత 20 రోజుల నుంచి కోలాటాన్ని నేర్చుకోవడం వల్ల మానసిక ప్రశాంతత ఏర్పడుతోంది. తోటి మహిళలతో లయబద్ధంగా అడుగులు వేస్తూ ముందుకు సాగడం ఆనందాన్ని ఇస్తోంది. రోజంతా ఇంట్లో పనులతో బిజీగా ఉన్నా సాయం కాలం సమయంలో తోటి మహిళలతో కలిసి కోలాటం ఆడడం అనుభూతిగా ఉంది. వివిధ భక్తి, జానపద, తెలంగాణ సంస్కృతి సాంప్రదాయ పాటలకు కోలాటం నేర్చుకుంటున్నాం.

శేషకుమారి, హనుమాన్‌నగర్ కాలనీ, నల్లగొండ

### ఎంతో ఆకర్షణగా ఉంది



కోలాటం నేర్చుకోవాలనే ఆలోచనతో మా కాలనీలోని మహిళలతో కలిసి ఒక గ్రూపుగా ఏర్పడి ప్రతి రోజూ శిక్షణ పొందుతున్నాం. ఈ క్రమంలో జడకొప్పు కోలాటం నేర్చుకోవడం సంతోషంగా అనిపిస్తోంది. ఈ కోలాటం ప్రత్యేక ఆకర్షణగా ఉంటుంది. కోలాటం ఆడుతూ తాళ్లను పట్టుకుని జడకొప్పు వేయడం మళ్లీ జడకొప్పు తీయడం ఎంతో మంచి అనుభూతినిస్తోంది.

షబానాబేగం, హనుమాన్‌నగర్

### మూడువేల మంది మహిళలకు ఉచితంగా శిక్షణ ఇచ్చా



నల్లగొండ పట్టణంలో పదేళ్ల నుంచి కోలాటంపై శిక్షణ ఇస్తున్నా. పట్టణానికి చెందిన సుమారు మూడు వేల మంది మహిళలకు ఉచితంగా శిక్షణ ఇచ్చా. ప్రాచీన కోలాట ప్రదర్శనను, జానపద సాంస్కృతిక ప్రదర్శనను ప్రాచార్యంలోకి తీసుకొచ్చేందుకు ప్రయత్నిస్తూనే కళకు జీవం పోస్తున్నా. వేసవిలో నా వద్ద నేర్చుకున్న మహిళా బృందాల అందరితో కలిపి 1,500 మందితో స్థానిక ఎన్‌జీ కళాశాల మైదానంలో పెద్దఎత్తున జడకొప్పుల కోలాట ప్రదర్శన నిర్వహిస్తా.


తోగోటి రమేష్, కోలాట మాస్టర్, నల్లగొండ

## గ్రేడింగ్‌పై పునరాలోచించాలి

"రాష్ట్రప్రభుత్వం పదో తరగతి పరీక్షా విధానంలో కీలకమార్పులు చేయాలని నిర్ణయించింది. 20 ఇంటర్నల్‌మార్కుల తొలగింపు, 100 మార్కులకు పరీక్షలు, 24 పేజీల జవాబు బుక్‌లెట్ మార్పులకు సిద్ధమైంది. అయితే ఈ నిర్ణయాలపై భిన్నాభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. విద్యార్థులకు ఇబ్బంది అని, భవిష్యత్‌కు మంచిదేనని మరికొందరు చెబుతున్నారు. ప్రభుత్వ ఆలోచనలపై విద్యార్థుల తల్లిదండ్రులు, ఉపాధ్యాయ వర్గాలు, విద్యావేత్తల అభిప్రాయాలు ఇలా ఉన్నాయి."

(ఆంధ్రజ్యోతి-భూదాన్‌పోచంపల్లి)

### ఇంటర్నల్ మార్కుల ఎత్తివేత తగదు



రాష్ట్ర ప్రభుత్వం పదో తరగతి విద్యార్థులకు గ్రేడింగ్ విధానానికి స్వస్తి పలికి, ఇంటర్నల్ మార్కులను ఎత్తివేసింది. మొత్తం 100 మార్కులకు పరీక్షలు నిర్వహించాలని ప్రభుత్వం గురువారం ఉత్తర్వులు జారీ చేసింది. ఈ విధానానికి రాష్ట్ర ప్రభుత్వం స్వస్తి పలకాలి. విద్యార్థులు ఇప్పటికే వార్షిక పరీక్షలకు సిద్ధమయ్యారు. ఇప్పుడు ఇంటర్నల్ మార్కులు ఎత్తివేయడం తగదు. విద్యార్థులు ఆందోళనలో పడకముందే ప్రభుత్వం పునరాలోచించాలి.

లచ్చుమల్ల వెంకటన్న, టీయూటీఎఫ్ రాష్ట్ర ప్రధానకార్యదర్శి

### విద్యార్థులపై పెనుభారం



వార్షిక పరీక్షలు సమీపిస్తున్న నేపథ్యంలో రాష్ట్ర ప్రభుత్వ నిర్ణయం విద్యార్థులకు పెనుభారంగా మారింది. ఇప్పటికే ఎఫ్‌ఏ-1, ఎఫ్‌ఏ-2, ఎఫ్‌ఏ-3 పూర్తి చేసుకున్నారు. అంతేగాక ఎస్‌ఏ-1 పూర్తి చేసుకుని ఇంటర్నల్ మార్కులకు తుది జాబితాలకు సమాయత్తమవుతున్నారు. పరీక్షల నిర్వహణలో 100 మార్కులు పెట్టడంతో ఇప్పుడు విద్యార్థుల్లో డోలాయమాన పరిస్థితి నెలకొంది. వారికి ఒక ప్యాటర్న్ ఏర్పడిన తర్వాత ఆ దిశగా వారు సిద్ధమవుతుంటారు. వారి మానసిక స్థితిపై పెనుభారం మోపడం తగదు. విద్యార్థులకు న్యాయం జరిగేలా చర్యలు తీసుకోవాలి.

సింగనబోయిన సత్యనారాయణ, ట్రస్మా రాష్ట్ర నాయకులు, భూదాన్‌పోచంపల్లి

### 100 మార్కుల ప్రశ్నపత్రం సబబే.. కానీ,



రాష్ట్ర ప్రభుత్వం పదో తరగతి విద్యార్థులకు ఇంటర్నల్ 20 మార్కులు రద్దు చేసి 100 మార్కుల ప్రశ్నాపత్రాలు నిర్వహించడం మంచిదే. కానీ, వచ్చే నూతన విద్యా సంవత్సరంలో ఈ విధానాన్ని అమలు చేస్తే ప్రయోజనకరంగా ఉంటుంది. 100 మార్కులకు ప్రశ్నావత్రాలతో మొత్తం 6 పరీక్షలే నిర్వహిస్తే బాగుంటుంది.

జె సుదర్శనం, విశ్రాంత ఉపాధ్యాయుడు

### ఈ ఏడాది యథావిధిగా నిర్వహించాలి



గత ఏడాది మాదిరిగానే విద్యార్థులకు ఈ ఏడాదీ పదో తరగతి పరీక్షలు నిర్వహించాలి. ఇప్పటికే పరీక్షలకు విద్యార్థులు సిద్ధమయ్యారు. ఇప్పటికే ఏఏ ప్రశ్నలు, ఎన్ని మార్కులు అన్న అంశాలపై ఉపాధ్యాయులు ఏవిధంగా అవగాహన కల్పిస్తారు. తల్లిదండ్రులుగా మా కోరిక ఒక్కటే, గత ఏడాది మాదిరి పరీక్షలు 20 మార్కుల ఇంటర్నల్‌తో నిర్వహించాలి. విద్యార్థులకు డోలామాయ పరిస్థితి కల్పించవద్దు.

కేమ చందన, పదవ తరగతి విద్యార్థి పేరెంట్

## ట్రినిటీ విద్యార్థులకు మల్కంబ్ క్రీడలో ఛాంపియన్‌షిప్



విజేతలను అభినందిస్తున్న ఎంఈవో గురువారావు

చౌటుప్పల్ టౌన్, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి) : యాదాద్రిభువనగిరి జిల్లా చౌటుప్పల్ పట్టణంలోని ట్రినిటీ హైస్కూల్‌కు చెందిన నలుగురు విద్యార్థులు జిల్లా స్థాయి మల్కంబ్ క్రీడలో వ్యక్తిగత ఛాంపియన్‌షిప్‌లు సాధించారు. స్కూల్ గేమ్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో మహబూబ్‌నగర్ జిల్లా కల్వకుర్తిలో ఈ నెల 27, 28 తేదీల్లో నిర్వహించిన మల్కంబ్ క్రీడా పోటీల్లో విద్యార్థులు కే అక్షిత, ఎన్ లోహిత్, ఎం. సహస్ర, ఎస్ శ్రీహర్షలకు ఛాంపియన్‌షిప్ సాధించారు. కాగా విద్యార్థులను ఎంఇవో గురువారావు, ట్రినిటీ ప్రిన్సిపాల్ మంజుల, చైర్మన్ కృష్ణారావు అభినందించారు.

## విద్యతో పాటు క్రీడల్లోనూ రాణించాలి



ఫుట్‌బాల్ అండర్-14 జిల్లా జట్ల ఎంపిక సమావేశంలో మాట్లాడుతున్న మునిసిపల్ చైర్మన్ శంకరయ్య

ఆలేరు, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులు విద్యతో పాటు, క్రీడల్లో రాణించి పాఠశాలకు, తల్లి దండ్రులకు పేరు తేవాలని ఆలేరు మునిసిపల్ చైర్మన్ వస్పరి శంకరయ్య అన్నారు. శుక్రవారం యాదాద్రిభువనగిరి జిల్లా ఆలేరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఆవరణలో అండర్-14 ఫుట్‌బాల్ ఉమ్మడి నల్లగొండ స్థాయి బాలుర, బాలికల జట్ల ఎంపిక పోటీలకు ఆయన హాజరై, మాట్లాడారు. క్రీడలతో ప్రతి ఒక్కరూ ఆరోగ్యంగా ఉంటారన్నారు. ఈ పోటీలకు ఉమ్మడి జిల్లా నుంచి సుమారు 200 మంది విద్యార్థులు హాజరయ్యారు. కార్యక్రమంలో పాఠశాల క్రీడా సమాఖ్య జిల్లా కార్యదర్శి బెజ్జం బాలకృష్ణ, కార్యనిర్వాహక కార్యదర్శి గడసంతల మధుసూదన్, ఫిజికల్ డైరెక్టర్ పూల నాగయ్య, పీటీలు ఎం జోసఫ్, తునికి చంద్రశేఖర్, వాసంతకుమారి, భావన, భాస్కర్, మల్లేష్, మధు నాగరాజు, సంపత్ నాగలక్ష్మీ బాలాజీ పలువురు పాల్గొన్నారు.

## 'సిల్కుసిటీ' పోచంపల్లికి ఖండాంతర ఖ్యాతి

భూదాన్‌పోచంపల్లిని సందర్శించిన ఇంగ్లాండ్ దేశ ప్రతినిధుల కితాబు



చేనేత మగ్గంపై వస్త్ర తయారీని పరిశీలిస్తున్న ఇంగ్లాండ్ దేశస్థులు

భూదాన్‌పోచంపల్లి, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి) : భూదానోద్యమ చారిత్రక నేపథ్యంతో పాటు చేనేత టైఅండ్‌డై ఇక్కత్ పట్టుచీరల తయారీ కేంద్రంగా భూదాన్‌పోచంపల్లి ఖండాంతర ఖ్యాతిగాంచిందని ఇంగ్లాండ్ దేశానికి చెందిన ఎన్జీవో సంస్థల ప్రతినిధులు కితాబునిచ్చారు. ఇంగ్లాండ్ దేశానికి చెందిన ఎడక్షన్ నార్త్ ఈస్ట్ ఎన్జీవో ట్రస్ట్ సంస్థకు చెందిన ఆరుగురు ప్రతినిధులు భారతదేశ పర్యటనలో భాగంగా హైదరాబాద్‌లోని హోప్ ఎన్జీవో ట్రస్ట్ సంస్థ అనుబంధాల మేరకు హైదరాబాద్ చేరుకున్నారు. ఈ సందర్భంగా శుక్రవారం వారు యాదాద్రి-భువనగిరి జిల్లా భూదాన్‌పోచంపల్లిని సందర్శించారు. ముందుగా రూరల్ టూరిజం సెంటర్ సందర్శించారు. అక్కడి మ్యూజియంలోని లీవ్ టు క్లాత్ ప్రాసెసింగ్ యూనిట్ సందర్శించి చేనేత టై అండ్ డై ఇక్కత్ చీరల తయారీ ప్రక్రియలను తెలుసుకున్నారు. అనంతరం భూదానోద్యమ చారిత్రక ఘట్టాలకు సంబంధించిన ఫొటోగ్యాలరీని వీక్షించారు. పట్టణంలోని చేనేత కార్మికుల గృహాలను సందర్శించి ఇక్కత్ డిజైన్లను పరిశీలించి వారి కళాత్మక నైపుణ్యాన్ని ప్రశంసించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అటు భూదానోద్యమం, ఇటు చేనేత వస్త్ర పరిశ్రమతో సిల్కుసిటీగా పేరొందిన పోచంపల్లికి ఖండాంతర ఖ్యాతి లభించిందన్నారు. హోప్ సంస్థ ఎండీ రాహుల్ లూథర్ ఆధ్వర్యంలో జరిగిన పర్యటనలో ఇంగ్లాండ్‌కు చెందిన విదేశీ ప్రతినిధులు హాయన్, డానియల్, టీనా, లింజి, ప్రిన్స్ పాల్గొన్నారు.

## గంధం ఊరేగింపులో పోటెత్తిన భక్తులు





అర్వపల్లి పోలీస్‌స్టేషన్ నుంచి దర్గాకు గంధాన్ని మోసుకెళ్తున్న డీఎస్పీ రవి, నాగారం సీఐ రఘువీరారెడ్డి, విద్యుద్దీపాల వెలుగుల్లో దర్గా

అర్వపల్లి, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి) : సూర్యాపేట జిల్లా అర్వపల్లి మండల కేంద్రంలోని హజ్రత్ ఖాజానసీరుద్దీన్ దర్గా బాబా ఉర్సు ఉత్సవాలు శుక్రవారం ఘనంగా ప్రారంభమయ్యాయి. మొదటి రోజున అర్వపల్లి పోలీస్‌స్టేషన్‌లో గంధం వద్ద ముస్లిం పెద్దలు ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించి, అక్కడ జెండాను పాతి, గంధం ఊరేగింపును ప్రారంభించారు. గంధాన్ని సూర్యాపేట డీఎస్పీ రవి, నాగారం సీఐ రఘువీరారెడ్డి, ఎస్ఐ బాలకృష్ణ, కాంగ్రెస్ పార్టీ జిల్లా ఉపాధ్యక్షుడు దరూరి యోగానందాచార్యులు, కాంగ్రెస్ పార్టీ జిల్లా యువజన ప్రధాన కార్యదర్శి గుడిపెల్లి మధుకర్‌రెడ్డి, జిల్లా వక్ఫ్‌బోర్డు ఇన్‌స్పెక్టర్ షేక్ మొహినొద్దీన్, హుస్సేన్, అలీ తీసుకువచ్చారు. సుమారు మూడు కిలోమీటర్ల దూరంలోని దర్గా వద్దకు డప్పు వాయిద్యాల నడుమ తీసుకెళ్లారు. దర్గా వద్ద వేలాది మంది భక్తులు గంధం కోసం పోటీపడ్డారు. గంధాన్ని ఊరేగింపుగా తీసుకొచ్చే సమయంలో పోలీసులు బారికేడ్లతో బందోబస్తును నిర్వహించారు. దర్గాలోని సమాధి వద్దకు గంధంతో పాటు గులాబీ రెక్కలు, అత్తర్, కొబ్బరికాయలు సమర్పించారు. దర్గా లోపల ఉన్న సమాధి వద్ద పెద్దసంఖ్యలో భక్తులు ప్రత్యేక ప్రార్థనలు చేశారు. దర్గాను విద్యుద్దీపాలతో అలంకరించారు. హైదరాబాద్ నుంచి వచ్చిన కవ్వాలీ బృందం ప్రదర్శన ప్రత్యేక ఆకట్టుకుంది. శుక్రవారం రాత్రి నుంచి శనివారం ఉదయం వరకు పాటలతో అలరించనున్నారు. దర్గా వద్ద వెలిసిన దుకాణాల వద్ద సందడి నెలకొంది. శుక్రవారం రాత్రంతా భక్తులు జాగారం చేయనున్నారు. గంధం ఊరేగింపు సందర్భంగా డీఎస్పీ రవి మాట్లాడుతూ మతసామరస్యానికి దర్గా ప్రతీక అన్నారు. కార్యక్రమంలో బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు అనిరెడ్డి రాజేందర్‌రెడ్డి, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు మోరపాక సత్యం, తుంగతుర్తి నియోజకవర్గ యువజన అధ్యక్షుడు వేల్పుల రమేష్, కనుకు శ్రీనివాస్, పులిచర్ల ప్రభాకర్ తదితరులు పాల్గొన్నారు.

## చలి నుంచి ఉపశమనం



సూర్యాపేటటౌన్, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి) : సూర్యాపేట జిల్లా కేంద్రంలో శుక్రవారం రోజంతా చల్లని వాతావరణం నెలకొంది. ఉదయం నుంచి రాత్రి వరకు ఏమాత్రం ఎండపొడ లేకుండ చలిదుప్పటి కప్పేసింది. దీంతో ప్రజలు సాయంత్రం చలి నుంచి ఉపశమనం కోసం కాసేపు చలిమంటలు వేశారు. శుక్రవారం జిల్లా కేంద్రంలో 20 డిగ్రీల కనిష్ఠ ఉష్ణోగ్ర నమోదైంది

## స్వామి శరణం.. అయ్యప్ప శరణం..



తాంత్రి ఆధ్వర్యంలో పడిపూజ



భూదాన్‌పోచంపల్లి, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి) : యాదాద్రిభువనగిరి జిల్లా భూదాన్‌పోచంపల్లిలోని అయ్యప్ప స్వామి దేవాలయంలో బ్రహ్మోత్సవాలు అయ్యప్ప భక్త సమాజం, ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో వైభవంగా కొనసాగుతున్నాయి. శుక్రవారం ఆలయంలో కృష్ణచైతన్యశర్మ తాంత్రి ప్రత్యక్ష పర్యవేక్షణలో నిర్వహిస్తున్న ఉత్సవాల్లో ఉదయం స్వామివారి మేలుకొలుపు, నిర్మల్య దర్శనం, మహాగణపతి హోమం, అభిషేకం, మలర్ నైవేద్యం, కళశాభిషేకం ఇతర పూజలు నిర్వహించారు. అనంతరం మహిళాభక్తులు లక్షపుష్పార్చన నిర్వహించారు. మధ్యాహ్నం 18 మెట్ల మహాపడి పూజకు పెద్దసంఖ్యలో అయ్యప్పమాలధారులు హాజరయ్యారు. అనంతరం భక్తులకు మహాన్నదానం నిర్వహించారు. రాత్రి ఉష బలి, పల్లివేట, హరిహరాసనం నిర్వహించారు. ఉత్సవాల్లో అయ్యప్ప భక్త సమాజం ప్రతినిధులు రాపోలు రామచంద్రం, భారత లవకుమార్, ఎన్నం శివకుమార్, మెరుగు గోపాల్‌యాదవ్, రేపాక జగన్ గుప్తా, బొడిగె బాబుగౌడ్, గంగపురం వెంకటేశ్‌గౌడ్, బొబ్బల జైపాల్ రెడ్డి, కొట్టం కరుణాకర్‌రెడ్డి, బొడిగె లింగంగౌడ్, కీర్తి సంజీవ, దోర్నాల గణేష్, చిలువేరు బాలనర్సింహ, రాపోలు శ్రీనివాస్, జితేందర్‌రెడ్డి, గుండు శ్రీరాములు, రచ్చ రామకృష్ణ పాల్గొన్నారు.

## స్థానిక సమరానికి సై

(5వ పేజీ తరువాయి)

అయ్యప్ప దీక్షలు స్వీకరించిన భక్తులకు అన్నప్రసాదాలు, భజనలకు ఏర్పాట్లు చేస్తున్నారు. దేవాలయాలు నిర్మిస్తుంటే భూరి విరాళాలు అందజేస్తున్నారు.

### రంగంలో నిలిచేందుకు పోటాపోటీ

రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం కొలువుదీరడంతో పదేళ్లపాటు స్థానిక సంస్థల్లో అవకాశాలు దక్కించుకోలేకపోయిన ద్వితీయ, తృతీయశ్రేణి నాయకులు ఈసారి ఎలాగైనా సర్పంచ్‌గా, ఎంపీపీగా, జడ్పీటీసీ సభ్యుడిగా గెలవాలనే సంకల్పంతో క్షేత్రస్థాయిలో పనిచేస్తున్నారు. శాసనసభ, పార్లమెంటు ఎన్నికల్లో అభ్యర్థుల గెలుపుకోసం శ్రమించిన కార్యకర్తలు స్థానిక సంస్థల్లో పోటీకి ఉవ్విళ్లూరుతున్నారు. మంత్రులు, ఎంపీలు, ఎమ్మెల్యేలతో పాటు కీలకనేతల ఆశీస్సులు పొందడం ద్వారా స్థానిక సంస్థల్లో అధికార కాంగ్రెస్ కండువాతో బరిలో దిగాలనే సంకల్పంతో పలువురు నాయకులు ప్రయత్నాలు ముమ్మరం చేశారు. ప్రతిపక్ష బీఆర్ఎస్‌లోనూ నాయకులు పట్టువదలకుండా గ్రామాల్లో పోటీకి సిద్ధమవుతున్నారు. పంచాయతీ ఎన్నికల్లో బలమైన పోటీ ఇస్తామని, పార్టీ అండగా నిలిస్తే ఎంతవరకైనా పోరాడతామని నేతలను కోరుతున్నారు. మరోవైపు బీజేపీ సైతం ఈసారి స్థానిక సంస్థల ఎన్నికలపై ప్రత్యేకంగా దృష్టి సారించింది. పార్లమెంటు ఎన్నికల్లో ఆ పార్టీ అభ్యర్థులు ద్వితీయ స్థానానికి రావడంతో ఆ ఊపుని కొనసాగించాలని, గ్రామాల్లోనూ జెండా ఎగరవేయాలని పట్టుదలగా ఉన్నారు. అందులో భాగంగానే ఇటీవల సభ్యత్వ నమోదును ఉధృతంగా నిర్వహించారు. మొత్తానికి స్థానిక సమరం మొదలైతే ఉమ్మడి జిల్లాలో రాజకీయం ఊపందుకోనుంది.

## కాల్వలో పడి వృద్ధురాలి మృతి


కొటాలి(ఫైల్)

పెద్దఅడిశర్లపల్లి, నవంబరు29(ఆంధ్రజ్యోతి): ప్రమాదవశాత్తు ఏ ఎమ్మార్పీ ప్రధాన కాల్వలో పడి వృద్ధురాలు మృతిచెందింది .ఈ ఘటన నల్లగొండ జిల్లా గుడిపల్లి మండలం సింగరాసిపల్లి గ్రామ శివారులో శుక్రవారం వెలుగు చూసింది. గుడిపల్లి ఎస్‌ఐ నర్సింహులు తెలిపిన వివరాల ప్రకారం.. పెద్దఅడిశర్లపల్లి మండలం చింతల్‌తండాకు చెందిన రమావత్ కొటాలి (85) గుడిపల్లి మండలం కేశంనేనిపల్లి గ్రామంలో నివాసం ఉంటున్న చిన్న కొడుకు రమావత్ పాండు భూమి కౌలుకు తీసుకుని సాగు చేస్తుండగా అతడి వద్దకు వచ్చి ఉంటుంది. కోటాలికి కంటి చూపు తగ్గి వృద్ధాప్యంతో మతిస్థిమితం సరిగ్గా లేక ఈ నెల 26న ఇంటి నుంచి చెప్పకుండా వెళ్లి పోయింది. దీంతో కుటుంబసభ్యులు వెతికిన ఆచూకీ లభించకపోవడంతో చివరికి గుడిపల్లి పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. శుక్రవారం ఉదయం సింగరాసిపల్లి గ్రామ శివారులోని ఏఎమ్మార్పీ ప్రధాన కాల్వలో మృతదేహం లభ్యం కావడంతో కుటుంబసభ్యులకు సమాచారం అందించారు. మృతురాలు కుమారుడు పాండు ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు. మృతదేహానికి పంచనామా అనంతరం పోస్టుమార్టం నిమిత్తం దేవరకొండ ప్రభుత్వ మార్చురీకి తరలించినట్లు ఎస్‌ఐ నర్సింహులు తెలిపారు.

## కారు ఢీ కొని వృద్ధుడు..

అనంతగిరి, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి): రోడ్డు దాటుతున్న వ్యక్తిని కారును ఢీ కొట్టడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. ఈ ఘటన సూర్యాపేట జిల్లా అనంతగిరి మండలం శాంతినగర్ గ్రామంలో శుక్రవారం జరిగింది. ఎస్‌ఐ నవీన్ తెలిపిన వివరాల ప్రకారం..మండలంలోని లక్కవరం గ్రామానికి చెందిన ఫణితిఎలీషా(64) శాంతినగర్ గ్రామంలో రోడ్డు దాటుతుండగా, కోదాడ వైపు నుంచి ఖమ్మం వైపు వెళ్తున్న కారు అతివేగంగా వచ్చి ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో ఎలీశాకు తీవ్రగాయాలై అక్కడికక్కడే చనిపోయాడు. మృతుడి కుమారుడు తిరపయ్య ఫిర్యాదు మేరకు కారు డ్రైవర్ చింతమళ్ల నర్సయ్యపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు. మృతుడికి భార్య, కుమారుడు, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు.

## సాగర్‌లో ఆక్టోపస్ దళాల మాక్ డ్రిల్


ప్రాజెక్టుపై మాక్ డ్రిల్‌లో పాల్గొన్న ఆక్టోపస్ దళాలు

నాగార్జునసాగర్, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి): నల్లగొండ జిల్లా నాగార్జునసాగర్ ప్రధాన డ్యామ్‌పై శుక్రవారం రాత్రి ఆక్టోపస్ దళాలు మాక్‌డ్రిల్ నిర్వహించాయి. ప్రధాన డ్యామ్‌పై ఉగ్రవాదుల దాడులు జరిగితే ఎలా ఎదుర్కోవాలో సాయంత్రం 4నుంచి రాత్రి 7 గంటల వరకు ఫైరింగ్ చేసి సిబ్బందికి చూపించారు. ప్రధాన డ్యామ్ రేడియల్ క్రస్ట్ గేట్లపై నుంచి ఎదురుగా వస్తున్న ఉగ్రవాదులను ఎలా ఎదుర్కోవాలో చూపారు. డ్యామ్ అంతర్భాగంలో ఉన్న గ్యాలరీల వద్ద, ప్రధాన జల విద్యుత్ కేంద్రంలో, ప్రధాన డ్యాంపై, జలాశయంలో నీటిమార్గంలో ఉగ్రవాదులు వచ్చి దాడి చేస్తే ఎలా మట్టుబెట్టాలో వివరించారు. డ్యామ్‌పై మాటువేసిన ఉగ్రవాదులను ఎలా అంతమొందించాలో, ఉగ్రవాదులు డ్యామ్‌పై ఎక్కడెక్కడ దాక్కునే అవకాశం ఉందో ఆక్టోపస్ దళాలు డ్యాంపై ఉన్న భద్రత సిబ్బందికి మాక్ డ్రిల్ నిర్వహించారు.

## డ్రగ్స్ తయారీ నిందితుడి అరెస్టు


నిందితుడిని అదుపులోకి తీసుకుంటున్న పోలీసులు

యాదగిరిగుట్ట రూరల్, నవంబరు 29, (ఆంధ్రజ్యోతి): డ్రగ్స్ తయారీ కేసులో ప్రధాన నిందితుడు భానుప్రసాద్‌ను శుక్రవారం పోలీసులు అరెస్టు చేశారు. స్థానిక సీఐ రమేష్ తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. శ్రీ యాదాద్రి లైఫ్ సైన్సెస్ పార్మాస్యూటికల్ కంపెనీలో డ్రగ్స్ తయారీకి పాల్పడుతున్న భానుప్రసాద్ తన స్వగ్రామం మండలంలోని పెద్దకందుకూర్ గ్రామ నుంచి యాదగిరిగుట్టకు బైక్ మీది వస్తుండగా స్థానిక పోలీసులకు పక్కా సమాచారంతో వాహనాన్ని స్వాధీనం చేసుకొని తనిఖీ చేయగా అందులో కేజీ నిషేధిత మెడిడ్రిన్, 400 గ్రాముల ఆల్ప్రో జోలమ్ పట్టుకున్నట్లు వివరించారు.

## మిర్యాలలో ఒకరిపై దాడి

నూతన్‌కల్, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి): పాతకక్షల నేపథ్యంలో గొడ్డలితో దాడి చేయడంతో వ్యక్తికి తీవ్ర గాయాలయ్యాయి. ఈ సంఘటన సూర్యాపేట జిల్లా నూతనకల్ మండలంలోని మిర్యాల గ్రామంలో బుధవారం రాత్రి జరిగింది. గ్రామస్తులు తెలిపిన వివరాల ప్రకారం.. ఆ గ్రామానికి నాయిని చంద్రయ్య, నాయిని సోమయ్యపై అదే గ్రామానికి చెందిన మోసంగి భరత్, అతడి తండ్రి వెంకన్న గొడ్డలితో దాడి చేయడంతో సోమయ్యకు తలకు బలమైన గాయాలయ్యాయి. అతడిని చికిత్స నిమిత్తం సూర్యాపేటకు తరలించారు. ఈ విషయమై ఎస్‌ఐ మహేంద్ర నాథ్‌ను వివరణ కోరగా ఇరువర్గాలు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఆయన తెలిపారు.

## ఆంజనేయ స్వామి విగ్రహం తొలగింపు


వేంకటేశ్వరాలయం వద్ద ప్రతిష్ఠించిన ఆంజనేయ స్వామి విగ్రహం

చిలుకూరు, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి): సూర్యాపేట జిల్లా చిలుకూరు మండ లంలోని రామాపురం గ్రామంలో వివాదాస్పదంగా మారిన ఆంజనేయ స్వా మి విగ్రహ ప్రతిష్ఠ సద్దుమణిగింది. శుక్రవారం తెల్లవారుజామున ఒంటి గంట సమయంలో పోలీసులు, రెవెన్యూ అధికారులు రాజశేఖర్‌రెడ్డి విగ్రహం ముందు ప్రతిష్ఠించిన ఆంజనేయుడి విగ్రహాన్ని తొలగించారు. గురువారం గ్రామంలో విగ్రహాన్ని తొలగించాలని ఒక వర్గం, విగ్రహాన్ని అక్క డే ఉంచాలని మరో వర్గం పట్టుబట్టడంతో వివాదం చెలరేగింది. కాగా అర్ధరాత్రి సమయంలో విగ్ర హం తొలగించడంతో వివాదం సద్దుమనిగింది. తెల్లవారే సరికి ఆంజనేయ స్వామి విగ్రహాన్ని పోలీసులు వేంకటేశ్వర స్వామి ఆలయం వద్దకు చేర్చారు. గ్రామం లో శుక్రవారం ఆ లయం వద్దకు చేర్చిన ఆంజనేయ స్వామి విగ్రహం వద్ద పూజలు జరపగా, కొంతమంది మాత్రం విగ్రహాన్ని తొలగించిన ప్రాంతంలో పూజలు నిర్వహించారు. గ్రామంలో అవాంఛనీయ ఘటనలు జరగకుండా కోదాడ రూరల్ సీఐ రజితారెడ్డి, ఎస్‌ఐ రాంబాబు బందోబస్తు నిర్వహించారు.

# వండాకే దొడ్డవుతోంది

(5పేజీ తరువాయి)

ఏజెన్సీ నిర్వాహకులు సరిగా వండకపోతుండడంతోనే అన్నం మెత్తబడటం, పలుకుగా ఉంటోందని అధికారులు వాదిస్తున్నారు. అయితే బీపీటీ బియ్యంలో పలు రకాలు ఉంటాయని, బియ్యాన్ని ఏడాదిపాటు నిల్వ ఉంచాకే వండితేనే అన్నం సన్నగా ఉండటంతోపాటు నాణ్యత ఉంటుందని, లేదంటే నూతన బియ్యానికి స్టీమ్‌చేసి వండితే అన్నం మంచిగా వస్తుందని కానీ స్టీమ్ బియ్యాన్ని సరఫరా చేసేందుకు ప్రభుత్వ నిబంధనలు ఒప్పుకోవని రైస్ మిల్లర్లు స్పష్టంచేస్తున్నారు. ప్రస్తుతం యాదాద్రి జిల్లాలోని హాస్టళ్లు, పాఠశాలలకు నిజామాబాద్ జిల్లా నుంచి బియ్యం సర ఫరా అవుతుండగా సూర్యాపేట, నల్లగొండ జిల్లాలకు ఆయా జిల్లాల్లో పండిన బియ్యాన్నే అందిస్తున్నారు.

**కొత్త బియ్యాన్ని ఇలా వండితే**

**సమస్యలే రావంటున్న అధికారులు**

ప్రస్తుతం సరఫరా అవుతున్న నూతన బియ్యాన్ని సరైన విధానంలో వండితే ఇబ్బందులే రావని అధికారులు స్పష్టం చేస్తున్నారు. ఖచ్చితంగా ఫిల్టర్ నీటితోనే అన్నం వండాలి, గంజి వార్చాలి, అన్నం విడివడటానికి (పుల్లలు పుల్లలుగా) చలికాలంలో రిఫైండ్ ఆయిల్‌ను మాత్రమే ఉడుకుతున్న అన్నంలో పోయాలి. కానీ ఇందుకు భిన్నంగా బోరు లేదా బావి నీటితో వండుతుండడం, గంజి వార్చకుండానే ఉంచడం, అన్నం విడివడడానికి పామాయిల్ కలుపుతుండడంతో అన్నం మెత్తగా అవుతుండడం, మీద ఉడికినట్లుగా ఉండి లోపల పలుకుగా ఉండడం, ముద్దకట్టడం జరుగుతున్నదని అధికారులు అంటున్నారు. ఈ దిశగా ఏజెన్సీ కార్మికులకు అవగాహన కల్పిస్తున్నామని, అయినప్పటికీ వారిలో ఆశించిన మార్పురావడం లేదని పేర్కొంటున్నారు. అలాగే వంట పాత్రలను శుభ్రంగా కడగక పో తుండడం, వంట దినుసులను భద్రపర్చడంలో జాగ్రత్త లు తీసుకోకపోవడం, వంటగదిని అపరిశుభ్రంగా ఉంచడంతోనే ఆహారం కలుషితమవుతున్నదని అధికారులు స్పష్టం చేస్తున్నారు. అయినప్పటికీ వస్తున్న ఫిర్యాదులతో హాస్టళ్ల, గురుకులాలు, పాఠశాలల్లోని ప్రస్తుత బియ్యాన్ని మా రుస్తూ పాతబియ్యాన్ని అందిస్తున్నట్లు అధికారులు అంటున్నారు.

**హాస్టల్ బాటపట్టిన అధికారులు**

హాస్టళ్లు, గురుకులాలు, పాఠశాలల మధ్యాహ్న భోజనంలో ఫిర్యాదులు పెరుగుతున్న నేపథ్యంలో అధికారులు హాస్టల్‌బాట పట్టారు. యాదాద్రి భువనగిరి జిల్లాలోని అన్ని హాస్టళ్లు, గురుకుల పాఠశాలల్లో 27న రాత్రి కలెక్టర్ హనుమంతరావుతో సహా అధికారులందరూ రాత్రి అక్కడే భోజనాలు చేసి పడుకొని విద్యార్థులతో గడిపారు. అలాగే శుక్రవారం జిల్లాలోని పలు పాఠశాలల్లో పలువురు అధికారులు మధ్యాహ్న భోజనంచేసి భోజనం నాణ్యతను పరిశీలించారు. ఇకనుంచి ప్రతీ అధికారి ప్రతీ హాస్టల్‌ను సందర్శించాల్సిందేనని కలెక్టర్ ఆదేశించారు. ఇదే తరహాలో నల్లగొండ, సూర్యాపేట జిల్లాల్లో కూడా అధికారుల తనిఖీలు, పర్యవేక్షణ పెరిగాయి. దీంతో విద్యార్థులకు నాణ్యమైన ఆహారం లభిస్తుందని తల్లిదండ్రులు ఆశిస్తున్నారు.

**యాదాద్రి భువనగిరి జిల్లాలో ఇలా..**

| యాజమాన్యం | పాఠశాలలు | విద్యార్థులు | సరఫరా అవుతున్న బియ్యం |
|---|---|---|---|
| గురుకులు | 96 | 22,920 | 235 టన్నులు |
| పాఠశాలలు | 689 | 60,235 | 94 టన్నులు |
| అంగన్‌వాడీ కేంద్రాలు | 901 | 22,526 | 48 టన్నులు |


మెత్తబడిన కిచిడీ

**నాణ్యమైన బియ్యాన్నే ఇస్తున్నాము**

గురుకులాలు, పాఠశాలలు, అంగన్‌వాడీ కేంద్రాలకు నాణ్యమైన బియ్యాన్నే సరఫరా చేస్తున్నాం. నాణ్యతలో రాజీ పడటంలేదు. అయితే కొత్త బియ్యాన్ని కార్మికులు సక్రమంగా వండకపోతుండడంతో సమస్యలు ఉత్పన్నమవుతున్నాయి. ఈ మేరకు ఏజెన్సీ నిర్వాహకులకు అవగాహన కల్పిస్తున్నాం. ఫిర్యాదులు అధికంగా వస్తే బియ్యాన్ని మారుస్తున్నాం. కానీ కార్మికులు జాగ్రత్తగా వండితే మంచి అన్నం విద్యార్థులకు లభిస్తుంది. ఇందుకు సంబంధిత అధికారులు పర్యవేక్షించాలని కోరుతున్నాము.

**బియ్యం నాణ్యత లోపిస్తున్నది**



సరఫరా అవుతున్న సన్న బియ్యంలో నా ణ్యత లోపిస్తున్నది. ఎంత జాగ్రత్తగా వండుతున్నప్పటికీ అన్నం దొడ్డుగా లేదా మెత్తగా ఉంటోంది. దీంతో అన్నం వండుతున్న కార్మికులపై అధికారులు సహా అందరూ ఆగ్రహం వ్యక్తంచేస్తున్నారు. నిబంధలన్నీ మాపైనే వేస్తున్నారు. కానీ వాస్తవంగా బియ్యం నాణ్యత లేకపోతుండడంతోనే అన్నం సరిగా ఉండటంలేదు. నాణ్యమైన బియ్యాన్ని సరఫరా చేస్తేనే విద్యార్థులకు మంచి అన్నాన్ని ఇవ్వగలుగుతాం. ఈ దిశగా అధికారులు ఆలోచన చేయాలి.

ముంతాజ్ బేగం,
మధ్యాహ్న భోజనం కార్మికురాలు, భువనగిరి

**చికెన్ ధరలు**

| జిల్లా | లైవ్ | డ్రెస్ | స్కిన్‌లెస్ |
|---|---|---|---|
| యాదాద్రి | రూ.138 | 210 | 240 |
| సూర్యాపేట | రూ.125 | 190 | 210 |
| నల్లగొండ | రూ.130 | 190 | 220 |



**సాగర్ సమాచారం**

| | |
|---|---|
| పూర్తిస్థాయి నీటి మట్టం | 590.00 అడుగులు |
| టీఎంసీలు | 312.0450 |
| ప్రస్తుత నీటి మట్టం | 587.70 |
| టీఎంసీలు | 305.9,222 |
| ఎడమకాల్వకు నీటి విడుదల | 5,654 |
| కుడికాల్వకు | 9,104 |
| విద్యుత్ కేంద్రం ద్వారా | 29,232 |
| ఎస్‌ఎల్‌బీసీ ద్వారా | 2,400 క్యూసెక్కులు |
| వరద కాల్వ ద్వారా | 300 క్యూసెక్కులు |
| ఇన్‌ఫ్లో | 35,315 |
| అవుట్‌ఫ్లో | 46,690 క్యూసెక్కులు |
| ఎన్ని గేట్ల ద్వారా | నిల్ |

**పులిచింతల ప్రాజెక్టు**

| | |
|---|---|
| పూర్తిస్థాయి నీటి నిల్వ | 45.77 టీఎంసీలు |
| ప్రస్తుత నీటి నిల్వ | 44.89 టీఎంసీలు |
| పులిచింతలకు నీటి రాక | 8,657 క్యూసెక్కులు |
| అవుట్‌ఫ్లో | 2000 క్యూసెక్కులు |
| ఎన్ని గేట్ల ద్వారా | నిల్ |

**మూసీ నీటిమట్టం**

| | |
|---|---|
| పూర్తిస్థాయి నీటి మట్టం | 645 అడుగులు |
| టీఎంసీలు | 4.46 |
| ప్రస్తుత నీటి మట్టం | 644.75 అడుగులు |
| టీఎంసీలు | 4.40 |
| ఎన్ని గేట్ల ద్వారా | నిల్ |
| ఇన్‌ఫ్లో | 24.18 క్యూసెక్కులు |
| అవుట్‌ఫ్లో | 240.68 క్యూసెక్కులు |

# కన్నుల పండువగా గిరిప్రదక్షిణ


గిరి ప్రదక్షిణలో పాల్గొన్న ఆలేరు ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ బీర్ల అయిలయ్య, గుట్ట ఈవో భాస్కర్‌రావు

భువనగిరి అర్బన్, నవంబరు 29(ఆంధ్రజ్యోతి): యాదగిరిగుట్ట లక్ష్మీనరసింహుడి ఆలయంలో శుక్రవారం స్వామి వారి జన్మనక్షత్రం పురస్కరించుకుని గిరి ప్రదక్షిణను వైభవంగా చేపట్టారు. రాష్ట్ర నలుమూలల నుంచి తరలి వచ్చిన సుమారు 10వేల మంది భక్తులు ప్రదక్షిణలో పాల్గొన్నారు. ఉదయం 5.30గంటలకు వేద మంత్రాలు, ఆస్థాన విద్వాంసుల మంగళవాయిద్యాల నడుమ ప్రభుత్వ విప్ బీర్ల అయిలయ్య, ఆలయ ఈవో ఏపూరు భాస్కర్‌రావు ప్రత్యేక పూజలు చేసి హారతి ఇచ్చి గిరి ప్రదక్షిణను అధికారికంగా ప్రారంభించారు. కాగా ప్రతి నెల స్వాతి రోజున కొండ చుట్టూ రెండున్నర కిలోమీటర్ల మేర గిరిప్రదక్షిణ చేయడం ఆనవాయితీ వస్తోంది. సుమారు 10వేల మంది భక్తులు 45నిమిషాల పాటు స్వామిని స్మరిస్తూ గిరిప్రదక్షిణ పూర్తి చేశారు. అనంతరం స్వామిఅమ్మవార్లను దర్శించుకొని మొక్కులు తీర్చుకున్నారు.

**శతఘటాభిషేక పూజలు**

ఆలయ ముఖమండపంలో వేకువజామున అష్టోత్తర శతఘటాభిషేకం నిర్వహించారు. నిత్యారాధనల అనంతరం ఉత్సవమూర్తులకు హారతి నివేదించారు. ముఖ మండపంలో 108కలశాల్లో పంచామృతాలు నింపి పంచసూక్త పఠనాలతో హోమం చేపట్టి ఉత్సవమూర్తులను అభిషేకించారు. తులసీ దళాలతో సహస్రనామార్చనలు చేపట్టారు. వేద మంత్రాలు, మంగళవాయిద్యాల నడుమ అష్టోత్తర శతఘటాభిషేకం నిర్వహించి 108 సువర్ణ పుష్పాలతో అర్చించారు. సాయంత్ర స్వామివారి జన్మనక్షత్రం సందర్భంగా దివ్యమనోహరంగా అలంకరించి ప్రత్యేక పూజలు చేశారు. అలాగే మండలంలోని మల్లాపురం దేవస్థాన గోశాలలో తులసీ దామోదర కల్యాణం, సత్యనా రాయణ స్వామి వ్రతం, వనభోజనాలు ఘనంగా చేపట్టారు.

**అమ్మవారికి ఊంజల్ సేవోత్సవం**

స్వామివారి సన్నిధిలో శుక్రవారం స్వామివారికి స్వర్ణ పుష్పార్చన, అమ్మవారికి ఊంజల్ సేవోత్సవం వైభవంగా జరిపారు. ఆగమశాస్త్ర రీతిలో పూజారులు వేకువ జామున సుప్రభాత సేవతో స్వయంభువులను మేల్కొ లిపి పంచామృతాలు, వేదమంత్ర పఠనాలతో అభిషేకం, తులసీదళాలు, కుంకు మతో అర్చించారు. ప్రాకార మం డపంలో హోమం, నిత్యకల్యాణం సంప్రదాయరీతిలో కొన సాగాయి. సాయంత్రం ప్రధానా లయంలో కొలువు దీరిన ఆండాళ్ అమ్మవారిని దివ్య మనోహరంగా అలంకరించి తిరువీధుల్లో ఊరేగించిన అర్చకులు అద్దాల మండపం ఊయలలో అధి ష్ఠింపజేశారు. అలాగే పాతగుట్ట ఆలయంలో నిత్య పూజలు సంప్రదాయ రీతిలో కొనసాగాయి. అనుబంధ శివాల యంలో పర్వత వర్ధిని రామ లింగేశ్వరస్వామి వారికి నిత్య పూజలు, యాగశాలలో చండీహోమం శైవాగవ పద్ధతి చేపట్టారు. కాగా, కార్తీక మాసం పురస్కరించుకొని కొండ కింద వ్రత మండపాల్లో 944 జంటలు వ్రతాలు చేశారు.


గిరిప్రదక్షిణలో పాల్గొన్న భక్తులు

**భక్తుల సందడి**

పవిత్ర కార్తీక మాసం, స్వాతి నక్షత్రం, లక్ష్మీవారం శుక్రవారం కావడంతో ఉభయ క్యూలైన్లు, తిరువీదులు భక్తులతో సందడిగా మారాయి. గిరిప్రదక్షిణ భక్తులతో కలిసి సుమారు 36వేల మంది ఇష్టదైవాలను దర్శించుకునేం దుకు తరలివచ్చిన భక్తులతో ఆలయ పరిసరాలు సంద డిగా మారాయి. ప్రత్యేక, ధర్మదర్శన క్యూలైన్లు భక్తులు రద్దీ నెలకొనగా ఉదయం 9 నుంచి 10గంటలు, సా యంత్రం 4 నుంచి 5గంటల వరకు బ్రేక్ దర్శనం, మధ్యాహ్నం 12 నుంచి ఒంటి గంట వరకు ఆరగింపు సమయంలో క్యూ లైన్లు నిలిపివేసినందున ఆ తర్వాత కొద్దిగా రద్దీ పెరిగింది. ప్రధానాలయం, కల్యాణోత్సవ మండపం, వ్రత మం డపాలు, ఆలయ తిరువీ ధులు, ప్రసాద విక్రయశాలలు సందడిగా మారగా ఆలయ ఉత్తర రాజ గోపురం ఎదురుగా భక్తులు ఫోటోలకు పోటీ పడ్డారు. అదే విధంగా భక్తుల రద్దీకి అనుగుణంగా తరలింపునకు కొండపైకి అధికారులు తగినన్నీ బస్సులు అందుబాటులో ఉంచారు. ఆలయ ఖజానాకు వివిధ విభాగాల ద్వారా రూ. 39,94,950 ఆదాయం సమకూరినట్లు ఆలయ ఈవో భాస్కర్‌రావు తెలిపారు.

## డిజిటల్ అరెస్ట్ పేరిట రూ.7.37లక్షలు దోపిడీ

నల్లగొండ క్రైం, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి): డిజిటల్ అరెస్ట్ ఉచ్చులో నల్లగొండ జిల్లా కేంద్రానికి చెందిన ఓ సాఫ్ట్‌వేర్ ఇంజినీర్ చిక్కుకుంది. ముంబై నుంచి క్రైం బ్రాంచ్ పోలీసులమంటూ బెదిరించడంతో ఆందోళన చెందిన మహిళ తన సెల్‌ఫోన్ నుంచి దఫదఫాలుగా రూ.7,37,990లను బదిలీ చేసింది. నల్లగొండ టూ టౌన్ ఎస్‌ఐ రావుల నాగరాజు, బాధితురాలు తెలిపిన వివ రాల ప్రకారం..నల్లగొండ పట్టణంలోని నాగార్జునకాలనీకి చెందిన బండారు రమాదేవి హైదరాబాద్‌లో సాఫ్ట్‌వేర్ ఇంజినీర్‌గా పని చేస్తోంది. ఈ నెల 26న ఆమె ఇంట్లో ఉన్న సమయంలో ఉదయం 11.30 గంట లకు ఆమె ఫోన్‌కు వీడియోకాల్ రావడంతో మాధవి ఎత్తి మాట్లాడారు. మీకు ఓ పార్సి ల్ వచ్చింది. అందులో చట్ట వ్యతిరేకమైన వస్తువులు ఉన్నాయి. ముంబై క్రైం బ్రాంచ్ లో మీ మీద, మీకుటుంబ సభ్యులపై కేసు నమోదైనట్లు తెలిపారు. సీబీఐ పోలీసులు మీ ఇంటికి వచ్చి మీతో పాటు మీ కుటుంబ సభ్యులను అరెస్టు చేస్తారని చెప్పి రమా దేవిని బెదిరించారు. డబ్బులు చెల్లిస్తే కేసు మ్యానేజ్ చేస్తామని చెప్పారు. ఇందుకు మొదట రూ.99,998ఫోన్ పేలో బదిలీ చేశారు. అనంతరం లింక్ పంపడంతో దాని ఓపెన్ చేయడంతో మొత్తం రూ.7,37,990 మాయం అయ్యాయి. కాగా శుక్రవారం సైబర్ నేరస్తులు ఫోన్‌చేసి ఆ డబ్బులు సరి పోవు ఇంకా కావాలని అడ గడంతో ఆమె నల్లగొండ టూటౌన్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. కేసునమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ రావుల నాగరాజు తెలిపారు.

## చెన్నైలో బుద్ధవనంపై ప్రజంటేషన్

నాగార్జునసాగర్, నవంబరు29(ఆంధ్రజ్యోతి):నల్లగొండ జిల్లా నాగార్జునసాగర్ బుద్ధవనంపై ప్రముఖ బౌద్ధ విశ్లేషకులు డాక్టర్ ఈమని శివనాగిరెడ్డి పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా వివరించారు. ఇంటర్నేషనల్ నెట్‌వర్క్ ఆఫ్ ఎంగేజ్ బుద్ధిస్టు నెట్ వర్క్, హెరిటేజ్ టు వర్క్, ఇంక్లూజివ్ సొసైటీస్ అనే అంశంపై శుక్రవారం చెన్నైలో నిర్వహించిన 21వ ద్వైవార్షిక సమావేశానికి తెలంగాణ తరఫున ఆయన హాజరయ్యారు. ఈ సందర్భంగా సాగర్‌లో ఉన్న బుద్ధవనం, నాగార్జున కొండ, ఆచార్య నాగార్జునుడి రచనలు, తెలంగాణలో బౌద్ధ ధర్మ వ్యాప్తి, స్థావరాలను గురించి ఆయన వివరించారు. శ్రీలంక, మయన్మార్, థాయ్‌లాండ్ , కొరియా, జపాన్, తదితర దేశాల నుంచి బౌద్ధ భిక్షువులు ఈ సదస్సుకు హాజరయ్యారు. బుద్ధవనం సందర్శనకు రావాలని ఆయా దేశాల బౌద్ధులను కోరగా అందుకు అన్ని దేశాల వారు సుముఖత చూపారన్నారు. సదస్సు ముగిసిన అనంతరం శివనాగిరెడ్డిని గౌతమ్ ప్రభు, విజయన్ బౌద్ధ పద్ధతిలో సత్కరించారు.

## పాముకాటుతో విద్యార్థి మృతి

యాదగిరిగుట్ట రూరల్, నవంబరు 29, (ఆంధ్రజ్యోతి): యాదాద్రిభువనగిరి జిల్లాలో ఓ విద్యార్థి పాముకాటుతో మృతిచెందాడు. గ్రామస్థులు, కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం.. యాదగిరిగుట్ట మండలంలోని మహబూబ్‌పేట గ్రామానికి చెందిన గాజుల మనీష్ (17) భువనగిరి పట్టణంలో ఐటీఐ చదువుతున్నాడు. గురువారం ఇంట్లో నిద్రిస్తున్న సమయంలో మధ్యరాత్రి పాము కరవడంతో తీవ్ర అస్వస్థతకు గురయ్యారు. హుటాహుటిన భువనగిరి ఏరియా ఆసుపత్రికి తీసుకెళ్లగా పరిస్థితి విషమించడంతో హైదరాబాద్‌కు తరలిస్తుండగా మార్గమధ్యంలో మృతి చెందాడు. ఈ విషయం పోలీసులకు ఫిర్యాదు చేసినట్లు తెలిసింది.


# తనయుడి చేతిలో తండ్రి హతం

**విద్యుత్ వైరుతో మెడకు గుంజి హత్య నల్లగొండ జిల్లా నార్కట్‌పల్లి మండలంలో ఘటన**

నార్కట్‌పల్లి, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి): కుటుంబ కలహాల నేపథ్యంలో తనయుడి చేతిలో తండ్రి హత మయ్యాడు. గురువారం సాయంత్రం నల్లగొండ జిల్లా నార్క ట్‌పల్లి మండలం నెమ్మాని గ్రామంలో ఈ సంఘటన జరిగింది. గ్రామస్థులు తెలిపిన వివరాల ప్రకారం నెమ్మాని గ్రామానికి చెందిన రైతు బక్కతట్ల లింగయ్య(55)కు భార్య, కుమారుడు, కుమార్తె ఉన్నారు. కుమార్తెకు వివాహంకాగా, కుమారుడు మల్లేశ్ రంగారెడ్డి జిల్లా ఇబ్రహీపట్నంలోని ఓ ప్రైవేటు ల్యాబ్ లో పనిచేస్తూ రెండేళ్ల క్రితం అక్కడి యువతిని కులాంతర వివాహం చేసుకుని అక్కడే నివాసం ఉంటున్నాడు. కుమా రుడు కులాంతర వివాహం చేసుకోవడం ఇష్టంలేని లింగయ్య చికాకుతో తరుచూ భార్యను అకారణంగా కొడుతూ వేధిస్తున్నాడు. అంతేకాకుండా ఇటీవల పత్తి విక్రయించగా వచ్చిన డబ్బులను ఎవరికీ ఇవ్వకుండా ఇష్టం వచ్చినట్లు ఖర్చు చేస్తున్నాడు. మల్లేశ్ భార్య గర్భందాల్చడంతో తల్లిని ఇబ్రహీంపట్నం రమ్మని కోరాడు. ఈ విషయమై మల్లేశ్ తల్లిదండ్రుల మధ్య గొడవ జరగడంతో మల్లేశ్ తల్లి ఘట్టమ్మ బంధువుల గ్రామం పరడ వెళ్లింది. ఈ క్రమంలో తండ్రిపై ఆగ్రహం పెంచుకున్న మల్లేశ్ గురువారం సాయంత్రం పత్తిచేలో ఉన్న లింగయ్య వద్దకు వెళ్లాడు. విద్యుత్ వైరుతో మెడకు గుంజి ఊపిరాడకుండా చేసి అక్కడినుంచి ఇంటికి చేరుకున్నాడు. తం డ్రిని కొట్టానని ఇంట్లో సమాచారమివ్వటంతో విషయం తెలుసుకున్న పోలీసులు సంఘటనా స్థలానికి వెళ్లి చూడగా, లింగయ్య విగతజీవిగా కనిపించాడు. నార్కట్‌పల్లి సీఐ నాగరాజు, ఎస్‌ఐ క్రాంతి కుమార్ సంఘటనా స్థలానికి వివరాలు తెలుసుకున్నాడు. నిందితుడు పోలీ సుల అదుపులో ఉన్నట్లు సమాచారం. మృతుడి తండ్రి రాము లు ఫిర్యాదు మేరకు కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

# హామీలు అమలు చేయకపోతే ఉద్యమమే

**● ప్రజలకు ఇచ్చిన ఆరు గ్యారెంటీలను కాంగ్రెస్ ప్రభుత్వం అమలు చేయాలి ● సూర్యాపేట జిల్లాలో జరిగిన సీపీఎం బహిరంగ సభలో తమ్మినేని వీరభద్రం**


అభివాదం చేస్తున్న తమ్మినేని వీరభద్రం

సూర్యాపేట సిటీ, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి): హామీలు అమలు చేయకపోతే మరో ఉద్యమం చేస్తామని, ఎర్రజెండాల పోరాటల ఫలితంగా కాంగ్రెస్ ప్రభుత్వం లగచర్లలో భూసేకరణ ప్రతిపాదనను వెనక్కి తీసుకుంటూ నోటిఫికేషన్ ఇచ్చిందని సీపీఎం రాష్ట్ర కార్యదర్శి తమ్మినేని వీరభద్రం అన్నారు. శుక్రవారం సూర్యాపేట జిల్లా కేంద్రంలో సీపీఎం సూర్యాపేట జిల్లా మూడోవ మహాసభల సందర్భంగా గాంధీ పార్కులో ఏర్పాటు చేసిన బహిరంగ సభలో మాట్లాడారు. సీపీఎం హెచ్చరికలకు తలొగ్గి ప్రభుత్వం లగచర్ల గ్రామంలో పర్యటించడానికి అనుమతి ఇచ్చిందన్నారు. లగచర్ల గ్రామ పర్యటనలో అనేక విషయాలను సీపీఎం తెలుసుకుందన్నారు. అక్కడ తెలుసుకున్న విషయాలను సీఎం రేవంత్ రెడ్డికి వివరించామని తెలిపారు. ఎర్రజెండా పోరాటం ఫలితంగానే ప్రభుత్వం ఫార్మా కంపెనీ ఏర్పాటు నిర్ణయాన్ని వెనక్కు తీసుకుందన్నారు. రేవంత్‌రెడ్డి అధికారంలోకి వచ్చిన వెంటనే రాష్ట్రంలో స్వేచ్ఛ ఉంటుందని, సచివాలయానికి ఉన్న గేట్లను తొలగించారని చెప్పారు. రాష్ట్ర ప్రజలకు ఏడో గ్యారెంటీగా స్వేచ్ఛను ప్రజలకు అందిస్తానని చెప్పిన సీఎం కూడా మాజీ సీఎం కేసీఆర్ విధానాలను అనుసరిస్తున్నారని విమర్శించారు.

**దేశ సంపద కార్పొరేట్‌కు.. : జూలకంటి**

బీజేపీ ప్రభుత్వం దేశ సంపదను కార్పొరేట్ శక్తులకు అప్పనంగా కట్టబెడుతోందని జూలకంటి రంగారెడ్డి అన్నారు. దేశంలో ఉన్న మెజార్టీ ప్రజలు ఆకలితో అలమటిస్తుంటే అంబానీ, అదానీల ఆస్తులు మాత్రం వేల కోట్లకు పెరుగుతున్నాయన్నారు.

**ప్రజలపై ధరల భారం పెరిగింది : లక్ష్మి**

దేశంలో బీజేపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన రోజు నుంచి ప్రజలపై ధరల భారం పెరిగిందని సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యురాలు మల్లు లక్ష్మి అన్నారు. మోదీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన నాటి నుంచి నేటి వరకు మహిళలు పట్టపగలు కూడా నడిచే పరిస్థితి లేదన్నారు. సీపీఎం జిల్లా కార్యదర్శి మల్లు నాగార్జున రెడ్డి అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో నెమ్మాది వెంకటేశ్వర్లు, కొలిశెట్టి యాదగిరిరావు, మట్టిపల్లి సైదులు, నాగారపు పాండు, కోట గోపి, చెరుకు ఏకలక్ష్మి, కోట రమేష్, పిట్టల రవి, పాల్గొన్నారు.

## రైతులను ఇబ్బంది పెట్టొద్దు

● డీఆర్‌డీవో శేఖర్‌రెడ్డి

మాడ్గులపల్లి, నవంబరు 29(ఆంధ్రజ్యోతి): కొనుగోలు కేంద్రాల్లో రైతులను ఇబ్బంది పెట్టొద్దని డీఆర్‌డీవో వై.శేఖర్‌రెడ్డి అన్నారు. శుక్రవారం మండలంలోని పాములపాడు, ఆగామోత్కూర్ గ్రామాల్లో ఏర్పాటు చేసిన ఐకేపీ ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ఆయన పరిశీలించి మాట్లాడారు. రైతులు నాణ్యతా ప్రమాణాలతో తీసుకొచ్చిన ధాన్యాన్ని ఎప్పటికప్పుడు కాంటాలు వేసి కొనుగోలు చేయాలన్నారు. కొనుగోలు చేసిన ధాన్యానికి సంబంధిత మిల్లుల నుంచి ట్రక్‌షీట్లు తెచ్చుకొని ట్యాబ్ ఎంట్రీని పూర్తి చేసి రైతులకు ఎలాంటి జాప్యం లేకుండా బిల్లు చేయాలన్నారు. కార్యక్రమంలో ఏపీఎం బాషపాక చంద్రశేఖర్, సీవోపీ పావని, రేణుక, వీవో అధ్యక్షురాలు మణెమ్మ, సంధ్య తదితరులు పాల్గొన్నారు.

# పల్లె దవాఖానాల్లో మౌలిక వసతుల లేమి

● కొన్ని చోట్ల అసంపూర్తిగా నిలిచిన భవన నిర్మాణాలు
● మరికొన్ని చోట్ల స్థలాభావంతో నిలిచిన కట్టడాలు



వేల్పుపల్లిలో అద్దె ఇంట్లో కొనసాగుతున్న పల్లె దవాఖాన



వేల్పుపల్లిలో అసంపూర్తిగా నిలిచిన పల్లె దవాఖాన కట్టడం

తుర్కపల్లి, నవంబరు 29: గ్రామీణ ప్రాంతాల్లోని పేద ప్రజలకు మెరుగైన వైద్య సేవలందించేందుకు కేంద్ర ప్రభుత్వ సహకారంతో గత బీఆర్ఎస్ ప్రభుత్వం పల్లెల్లో పల్లె దవాఖానాలను ఏర్పాటు చేసింది. ఆ పల్లె దవాఖానాల్లో కనీస మౌలిక వసతులు లేక పోవడంతో వైద్య సిబ్బంది, ఆసుపత్రికి వచ్చే రోగులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. తుర్కపల్లి పీహెచ్‌సీ పరిధిలో ఆరు ప్రాథమిక ఆరోగ్య ఉప కేంద్రాలు ఉండగా, ఇందులో జాతీయ గ్రామీణ ఆరోగ్య మిషన్ ద్వారా కేంద్ర ప్రభుత్వ సహకారంతో రాష్ట్ర ప్రభుత్వం వేల్పుపల్లి, వీరారెడ్డిపల్లి, పల్లె పహాడ్, మాధాపూర్ ప్రాథమిక ఆరోగ్య ఉప కేంద్రాలను పల్లె దవాఖానాలుగా మార్చింది. ఒక్కో పల్లె దవాఖానాకు ఒక ఎంబీబీఎస్ లేక బీఏఎంఎస్ డాక్టర్‌తో పాటు ఏఎన్ఎం, ఆశ కార్యకర్తను ప్రభుత్వం నియమించింది. పల్లె దవాఖానాలకు పల్లెపహాడ్, మాధాపూర్ ప్రాథమిక ఉప కేంద్రాలకు సొంత భవనాలు ఉండడంతో ఆ భవనాల్లోనే పల్లె దవాఖానాలను కొనసాగిస్తున్నారు. కానీ మండలంలోని వేల్పుపల్లి, వీరారెడ్డిపల్లి ప్రాథమిక ఆరోగ్య ఉప కేంద్రాలకు సొంత భవనాలు లేవు. వీరారెడ్డి పల్లి పల్లె దవాఖానాను గ్రామంలోని బీసీ కమ్యూనిటీ హాల్‌లో ఓ చిన్న గదిలో నిర్వహిస్తుండగా ఈ ఆసుపత్రి పరిధిలోకి తిర్మాలాపూర్, గందమల్ల, వీరారెడ్డిపల్లి గ్రామాలు వస్తాయి. వేల్పుపల్లి పల్లె దవాఖానాను గ్రామంలోని ఓ పెంకుటిల్లును నెలకు రూ.1000 చొప్పున అద్దెకు తీసుకుని నిర్వహిస్తున్నారు. ఈ అద్దె భవనానికి రెండు సంవత్సరాలుగా ప్రభుత్వం అద్దె చెల్లించక పోవడంతో డాక్టరే తన సొంత డబ్బులతో అద్దె చెల్లిస్తున్నారు. ఆ అద్దె ఇల్లు కూడా ఓ వైపు కూలిపోయింది. కూలిపోగా మిగిలి ఉన్న గదిలోనే ఆసుపత్రిని నడుపుతున్నారు. ఆసుపత్రి బోర్డు మాత్రం ఇంటి వెనకలో ఉన్న మరో ఇంటిగోడకు రాశారు. ఈ ఆసుపత్రి పరిధిలో దత్తాయపల్లి, ఇబ్రహీంపూర్, వెంకటాపూర్, కోనాపూర్, డీబీతండ, మంచిరోనిమామిళ్ల, జీకే తండ, జేకేతండ గ్రామాల ప్రజలు వేల్పుపల్లి పల్లె దవాఖానాకు వస్తారు. ప్రభుత్వం పల్లె దవాఖానాలను ఏర్పాటు చేసింది కానీ మౌలిక వసతులు కల్పించక పోవడంతో సిబ్బంది, ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. పేద ప్రజలకు మెరుగైన సేవలు అందడం లేదు.

**భవన నిర్మాణాలకు నిధులు మంజూరు**

వీరారెడ్డిపల్లి, వేల్పుపల్లి పల్లె దవాఖానాల నూతన భవన నిర్మాణాలకు ప్రభుత్వం రాష్ట్ర ఆరోగ్య మౌలిక వసతుల అభివృద్ధి సంస్థ నుంచి ఒక్కో భవనానికి రూ.20లక్షల చొప్పున మంజూరు చేసింది. వేలుపల్లిలో పల్లెదవాఖాన నూతన భవన నిర్మాణం కోసం 31జనవరి 2024న ప్రభుత్వ విప్ బీర్ల అయిలయ్య నిర్మాణం పనులకు శంఖుస్థాపన చేసారు. సంబంధిత కాంట్రాక్టర్ నిర్మాణ పనులు ప్రారంభించి, బేస్మెంట్ నిర్మాణం పూర్తి చేసి, పిల్లర్లు వేసేందుకు సీకులు నిలబెట్టి నిర్మాణ పనులను మూడు నెలల క్రితం నిలిపి వేసింది. చేసిన నిర్మాణ పనులకే ప్రభుత్వం డబ్బులు చెల్లింక పోవడంతో భవన నిర్మాణ పనులను నిలిపి వేసినట్లు కాంట్రాక్టర్ కల్లూరి శ్రీనాథ్‌రెడ్డి తెలిపారు. కాగా వీరారెడ్డిపల్లి పల్లె దవాఖానా భవన నిర్మాణానికి గ్రామంలోని సర్వే నెంబరు 274లో స్థలాన్ని కేటాయించినట్లు తాజా మాజీ సర్పంచ్ జక్కుల శ్రీవాణివెంకటేష్ తెలిపారు. ముల్కలపల్లి సబ్‌సెంటర్ భవన నిర్మాణానికి టెండర్ పూర్తయినప్పటికీ భవన నిర్మాణం పనులు చేపట్టేందుకు స్థలం కేటాయించక పోవడంతో పనులు ప్రాంభం కాలేదు.

**నిధుల కొరతతో పనులు నిలిచిపోయాయి**

మండలంలోని వేల్పుపల్లి పల్లెదవాఖానా, ముల్కలపల్లి పీహెచ్‌సీ సబ్‌సెంటర్ భవన నిర్మాణ పనులు చేపట్టేందుకు టెండర్ ప్రక్రియ పూర్తియింది. వీరారెడ్డిపల్లి పల్లె దవాఖానా భవణ నిర్మాణానికి టెండర్ వేసినా నిర్మాణ పనులు చేపట్టేందుకు ఎవరు రాలేదు. వేల్పుపల్లి, సబ్‌సెంటర్ నిర్మాణ పనులు నిధుల కొరత కారణంగానే ఆగిపోయాయి. ముల్కలపల్లిలో స్థలం కేటాయిస్తే భవన నిర్మాణ పనులు ప్రారంభిస్తాం.

**- శివకుమార్, టీఎస్‌ఈడబ్ల్యూఐడీసీ డీఈఈ**

**పల్లె దవాఖానాలకు భవనాలు కట్టివ్వాలి**

వేల్పుపల్లి, వీరారెడ్డిపల్లి పల్లె దవాఖానాలతో పాటు ముల్కలపల్లి పీహెచ్‌సీ సబ్‌సెంటర్‌కు కూడ నూతన భవన నిర్మాణాలు చేపట్టేందుకు ప్రభుత్వం రూ.20లక్షల రూపాయల చొప్పున మంజూరు చేసింది. భవన నిర్మాణ పనులను ప్రారంభించి త్వరిత గతిన పూర్తి చేసి, భవనాలు ఇచ్చినట్లైతే ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించేందుకు అవకాశం ఉంటుంది.

**- డాక్టర్ రుచిరారెడ్డి, పీహెచ్‌సీ తుర్కపల్లి**

## ఆశ్రమాల్లో వసతులు కల్పించాలి

భువనగిరి రూరల్, వలిగొండ, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి): అనాథ వృద్ధాశ్రమంలో వసతుల కల్పనపై దృష్టి సారించాలని జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి వి.మాధవీలత నిర్వాహకులకు సూచించారు. శుక్రవారం భువనగిరి శివారులోని రాయిగిరిలో గల సహృదయ వయోవృద్ధుల ఆశ్రమాన్ని ఆమె సందర్శించి వృద్ధులకు పండ్లను పంపిణీ చేసి వసతులను పరిశీలించారు. కార్యక్రమంలో రామన్నపేట బార్ అసోసియేషన్ అధ్యక్షులు ఎంఏ మాజిద్, న్యాయవాదులు మొగులయ్య, స్వామి, సత్తయ్య పాల్గొన్నారు.

● వలిగొండ మండలంలోని టేకులసోమారం గ్రామంలోని సాధన మానసిక దివ్యాంగులకు జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి మాధవీలత శుక్రవారం దివ్యాంగులకు పండ్ల పంపిణీ చేశారు. ఆశ్రమంలోని వసతులను పరిశీలించారు. కార్యక్రమంలో బార్ అసోసియేషన్ అధ్యక్షులు ఎండీ.అబ్దుల్ మాజీద్, లీగల్‌ఎయిడ్ కౌన్సిల్ నకిరేకంటి మొగులయ్య, నోముల స్వామి, ప్యానల్ అడ్వకేట్ దంతూరి సత్తయ్యగౌడ్ పాల్గొన్నారు.

## రైతుల సంక్షేమానికి పెద్దపీట

భువనగిరి రూరల్, నవంబరు 29(ఆంధ్రజ్యోతి): సీఎం రేవంత్ రెడ్డి పాలనలో రైతుల సంక్షేమానికి పెద్దపీట వేస్తున్నట్లు మార్కెట్ కమిటీ చైర్‌పర్సన్ కనుకుంట్ల రేఖ బాబురావు అన్నారు. శుక్రవారం భువనగిరిలో జరిగిన సమావేశంలో ఆమె మాట్లాడారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీల్లో భాగంగా ఆరు గ్యారంటీలను పకడ్బందీగా అమలు చేసి అన్ని వర్గాల ప్రజలకు సంక్షేమ పథకాలు అందేలా కాంగ్రెస్ ప్రభుత్వం కృషి చేస్తుందన్నారు. సమావేశంలో డైరెక్టర్లు తాడూరి నర్సింహ, చిన్నం శ్రీనివాస్, పిట్టల రజిత పాల్గొన్నారు.

## సమాచారం

### నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

భువనగిరి గంజ్, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి): భువనగిరి పట్టణంలోని మెయిన్ రోడ్డు విస్తరణలో భాగంగా వినాయక చౌరస్తా నుంచి పాత బస్టాండ్ వరకు ఇరు వైపులా 11కేవి లైన్స్ మీదికి లైన్ షిఫ్టింగ్ పనుల నిమిత్తం టవర్స్ మీదికి కొత్త లైను లాగనున్నారు. శనివారం ఉదయం 10గంటల నుంచి సాయంత్రం 5గంటల వరకు భువ నగిరి పట్టణంలోని పాత బస్టాండ్ నుంచి ఎస్ఎల్ఎన్ఎస్ కాలేజీ, సంతోష్‌నగర్, శృతిన గర్, పెంటాజినగర్ వరకు తదితర ప్రాంతాల్లో విద్యుత్ అంతరాయం ఉంటుందని, పట్టణ ప్రజలు సహకరించాలని విద్యుత్ అధికారులు ఓ ప్రకటనలో తెలిపారు.

### పాఠశాల పేరు మార్పు

రాజాపేట, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి): రాజాపేట మండలం రాఘునాథ్‌పూర్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల పేరును కలెక్టర్ ఆదేశాల మేరకు మార్పు చేసినట్లు పాఠశాల ప్రధానోపాధ్యాయుడు మనోజ్‌కుమార్ శుక్రవారం తెలిపారు. సంగిశెట్టి నర్సయ్య మెమోరియల్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలగా మార్పు చేసినట్లు తెలిపారు. నర్సయ్య కుటుంబం పాఠశాల నిర్మాణానికి భూదానం చేసి దాతృత్వాన్ని చాటుకుందని తెలిపారు.

## చేయూత

### బాధిత కుటుంబాలకు సాయం

సంస్థాన్ నారాయణపురం నవంబర్29(ఆంధ్రజ్యోతి): మండలంలోని గుజ్జ గ్రామంలో ఇటీవల మరణించిన బీఆర్ఎస్ కార్యకర్తల కుటుంబాలకు గుజ్జ గ్రామశాఖ, గుడిమల్కాపురం మాజీ ఎంపీటీసీ శివరాత్రి కవిత విద్యాసాగర్‌లు శుక్రవారం రూ.35 ఆర్థిక సాయం అందజేశారు. వసుకుల చిన్న మల్లయ్య కుటుంబానికి రూ.15.వేలు, చాడ ఎల్లమ్మ కుటుంబానికి రూ.10వేలు, ఎర్ర మల్లమ్మ కుటుంబానికి రూ.10వేల చొప్పున ఆర్థిక సహాయం అందించారు. కార్యక్రమంలో గుడి మల్కాపురం మాజీ ఎంపీటీసీ కవితసాగర్, గడ్డం మురళీధర్‌రెడ్డి, గంగాదేవి సత్తయ్య ,ఏర్పుల సైదులు, యాదవరెడ్డి, ఎర్ర శ్రీశైలం, మైల రాజేందర్ రెడ్డి పాల్గొన్నారు.

### మిత్రుని కుటుంబానికి..

మోత్కూరు, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి): మండలంలోని అనాజిపురం గ్రామానికి చెందిన కుమ్మరికుంట్ల నర్సిరెడ్డి (33) ఇటీవల మృతి చెందాడు. అతనితో చదువుకున్న 2006-07 ఎస్ఎస్‌సీ బ్యాచ్ జడ్పీహెచ్ఎస్ పొడిచేడు విద్యార్థులు నర్సిరెడ్డి మాతృమూర్తిని పరామర్శించి రూ.21వేలు ఆర్థిక సహాయం అందించారు.

వలిగొండ: మండలంలోని మొగిలిపాక గ్రామానికి చెందిన శ్యామల నర్సింహ అనారోగ్యంతో మృతి చెందాడు. కాగా బాధిత కుటుంబానికి కాంగ్రెస్ పార్టీ నాయకులు మామిడి సత్తిరెడ్డి రూ.5వేలు అందజేశారు.

# నాణ్యమైన భోజనాన్ని అందించాలి

● జడ్పీ సీఈవో శోభారాణి



బొల్లేపల్లి హైస్కూల్‌లో విద్యార్థులతో కలిసి భోజనం చేస్తున్న జడ్పీ సీఈవో శోభారాణి

భువనగిరి రూరల్, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి): పేద విద్యార్థులు ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతో పాటు నాణ్యమైన భోజనాన్ని అందించే విధంగా అధికారులు ప్రత్యేక చొరవ చూపాలని జిల్లా పరిషత్ సీఈవో ఎన్.శోభారాణి సూచించారు. శుక్రవారం భువనగిరి మండలం బొల్లేపల్లి జడ్పీ హైస్కూల్‌ను ఆమె ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా విద్యార్థులతో మాట్లాడుతూ ఉపాధ్యాయులు సమయ పాలన పాటించి విద్యార్థులకు మెరుగైన విద్య అందించేందుకు కృషి చేయాలన్నారు. మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించి విద్యార్థులతో కలిసి భోజనం చేశారు. కార్యక్రమంలో ఎంపీవో ఎం.దినకర్, విజయేందర్ రెడ్డి పాల్గొన్నారు.

భూదాన్‌పోచంపల్లి : మధ్యాహ్న భోజనం తయారీలో నిర్వాహకులు నాణ్యత ప్రమాణాలు పాటించాలని జిల్లా పంచాయతీ అధికారి, మండల ప్రత్యేకాధికారి సునంద అన్నారు. స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత బాలుర, బాలికల పాఠశాలల్లో, ప్రాథమిక పాఠశాలలో మధ్యాహ్న భోజనాన్ని ఆమె పరిశీలించారు. కార్యక్రమంలో ఎంపీడీవో ఆర్ భాస్కర్, తహసీల్దారు మహేందర్‌రెడ్డి, ఎంపీవో మాజిద్, పీహెచ్‌సీ వైద్యాధికారి డాక్టర్ శ్రీవాణి, ఎంఆర్ఐ వెంకటరెడ్డి, సివిల్ సప్లై అధికారి వనజాత పాల్గొన్నారు.

సంస్థాన్‌నారాయణపురం: మండల కేంద్రంలో జడ్పీ బాలికల పాఠశాలను తహసిల్దార్ మామిడి కృష్ణ ఆకస్మికంగా తనిఖీ చేశారు.

ఆత్మకూరు(ఎం): ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు నాణ్యమైన బోజనం అందించాలని తహసీల్దార్ వి. రవికుమార్ వంట ఏజెన్సీలను ఆదేశించారు. మండల కేంద్రంలోని హైస్కూల్లో విద్యార్థుల మధ్యాహ్న భోజన వంటకాలను, స్టోర్ రూంలో సరుకులను పరిశీలించారు. మండల విద్యాధికారి కె.మహదేవరెడ్డి, ఏఆర్ఐ వెంకటేశ్వర్లు ఆయన వెంట ఉన్నారు.

మోటకొండూరు : విద్యార్థులకు చదువుతో పాటు నాణ్యమైన భోజనం అందించాలని తమసీల్దార్ శాంతిలాల్ అన్నారు. మండలంలోని చందేపల్లిలో ప్రాథమిక పాఠశాలను భోజన సమయంలో పరిశీలించారు. ఉపాధ్యాయులు నరేందర్, సుజాత, పంచాయతీ కార్యదర్శి భవాని, సీఆర్‌పీ నరేందర్ పాల్గొన్నారు.

అడ్డగూడూరు: విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించాలని మండల ప్రత్యేకధికారి కృష్ణ అన్నారు. మండల కేంద్రంలోని జడ్పీహెచ్ఎస్ పాఠశాలను ఆ యన సందర్శించారు. ఆయన వెంట ఎంపీవో ప్రేమాలత ఉన్నారు.

## ధరణి సమస్యలు త్వరలో పరిష్కరిస్తాం

● అదనపు కలెక్టర్ వీరారెడ్డి

మోత్కూరు, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి): జిల్లా వ్యాప్తంగా సుమారు రెండు వేల ధరణి సమస్యలు పెండింగ్‌లో ఉన్నాయని, వాటిని త్వరలోనే పరిష్కరిస్తామని అదనపు కలెక్టర్ (రెవెన్యూ) బి.వీరారెడ్డి అన్నారు. శుక్రవారం మోత్కూరు తహసీల్దార్ కార్యాలయాన్ని ఆయన సందర్శించి, పరిశీలించారు. రికార్డుల గదిని పరిశీలించి, సిబ్బందిని మందలించారు. రికార్డుల గదిని శుభ్రంగా ఉంచాలన్నారు. జిల్లా వ్యాప్తంగా 372 ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేసి 1.90లక్షల మెట్రిక్ టన్నుల దొడ్డు ధాన్యం, 2వేల మెట్రిక్ టన్నుల సన్నధాన్యం కొన్నామన్నారు. ధ్రువీకరణ పత్రాల కోసం తహసీల్దార్ కార్యాలయం చుట్టూ తిరుగవద్దని, మీసేవా ద్వారా దరఖాస్తు చేసుకోవాలన్నారు. సుమారు వంద వివిధ సర్టిఫికెట్లు పెండింగ్‌లో ఉన్నాయని, పరిశీలించి వెంటనే క్లియర్ చేస్తామన్నారు. పౌర సరఫరాల జిల్లా మేనేజరు జగదీష్‌కుమార్, తహసీల్దార్ డి.రాంప్రసాద్, ఎంపీడీవో డి.బాలాజీ, ఎంఈవో టి.గోపాల్‌రెడ్డి ఆయన వెంట ఉన్నారు.

## భక్తిశ్రద్ధలతో గంధం ఊరేగింపు

ఆలేరు, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి): జింతాస మదర్ సాహేబ్ దర్గా ఉర్సు ఉత్సవం శుక్రవారం ఆలేరులో ఘనంగా నిర్వహించారు. ఉర్సు ఉత్సవ నిర్వహకులు బిజెని మధుకుమార్ (మదర్) కాటమయ్యనగర్ నుంచి తన నివాసం వరకు గంధం అత్యంత భక్తిశ్రద్ధలతో కొనసాగింది. మేళతాళాలు ముస్లిం పెద్దల కావళి కొనసాగిన గంధం ఊరేగింపు ప్రజలను ఆకట్టుకుంది. అన్ని వర్గాల ప్రజలు ఉర్సు ఉత్సవానికి అధిక సంఖ్యలో హాజరయ్యారు. ఈ సందర్భంగా దర్గా వద్ద భక్తులకు మంచినీటి వసతి కల్పించారు. కార్యక్రమానికి ఆలేరు మాజీ ఎమ్మెల్యే బీఆర్ఎస్ రాష్ట్ర నాయకులు బూడిద బిక్షమయ్య గౌడ్ హాజరై దర్గావద్ద పూజలు చేశారు. ఆయన వెంట.. మునిసిపల్ చైర్మన్ వస్పరి శంకరయ్య, బీఆర్ఎస్ పట్టణ అధ్యక్షుడు పుట్ట మల్లేష్, నాయకులు పత్తి వెంకటేష్, గోరేమియా పాల్గొన్నారు.

## బాలలు దేశ ప్రగతిలో భాగం కావాలి

మోటకొండూరు, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి): గ్రామీణ బాలలు రేపటి దేశ ప్రగతిలో భాగం కావాలని గిన్నిస్ బుక్ ఆఫ్ రికార్డు, కళాకారుడు, పర్యావరణ వేత్త, రచయిత పెండెం కృష్ణ అన్నారు. శుక్రవారం మండలంలోని ముత్తిరెడ్డిగూడెంలోని మానస విద్యా మందిర్‌లోని విద్యార్థులకు వివిధ దేశాల నాయకులు, శాస్త్రవేత్తల చిత్రపటాలు, మెడికల్ కిట్లు, వాటర్ క్యాన్లు, గోడ గడియారం, క్లాత్‌బ్యాగ్‌లను పంపిణీ చేశారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ ప్రియాంక, ప్రెసిడెన్సీ గ్రూప్ ఆఫ్ చైర్మన్ జయలక్ష్మి, శారద పాల్గొన్నారు.

## విద్యార్థులకు బహుమతుల ప్రదానం

భువనగిరి గంజ్, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి) : అంతర్జాతీయ సైన్స్ ఒలంపియాడ్ ఫౌండేషన్ 2023-2024 విద్యా సంవత్సరం నిర్వహించిన పోటీ పరిక్షల్లో జీనియస్ మొదటి స్థానం సాధించిందని పాఠశాల కరస్పాడెంట్ డాక్టర్ బి.సూర్యనారాయణరెడ్డి తెలిపారు. విద్యార్థులకు నిర్వహించిన పోటీల్లో ఎం.సిరిచందన పదో తరగతి జీకే పోటిలో అంతర్జాతీయ స్థాయిలో 39వ ర్యాంకుతో పాటు 5000రూ. నగదు బహుమతి మొదటి స్థానం పొందింది. 2వ తరగతి చెందిన విద్యార్థులు సీహెచ్.అద్విత, బి.హన్విక, ఎన్.అయిక్షమినాల్ అంతర్జాతీయ ఇంగ్లీష్ ఒలంపియాడ్ పోటీల్లో 9వ ర్యాంకులతో పాటు రూ.500 నగుదు బహుమతి పొందారు.

## కార్పొరేట్ బ్యాంకులకు దీటుగా సేవలు

భువనగిరి రూరల్, నవంబరు 29(ఆంధ్రజ్యోతి): కార్పొరేట్ బ్యాంకులకు దీటుగా యాదాద్రి కో ఆపరేటివ్ క్రెడిట్ సొసైటీ బ్యాంకు చైర్మన్ పోలా శ్రీనివాస్ గుప్తా అన్నారు. శుక్రవారం జరిగిన బ్యాంకు పాలకమండలి సమావేశంలో రేఖల అంజయ్య, బచ్చు శ్రీనివాస్, వెంకట సురేష్‌ను నూతన డైరెక్టర్లుగా ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈసందర్భంగా మాట్లాడుతూ సొసైటీ ప్రారంభించిన అనతి కాలంలోనే మంచి పురోగతి సాధించిందన్నారు.

## 14న భువనగిరిలో టీపీఎఫ్ జిల్లా మహాసభలు

వలిగొండ, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి): భువనగిరిలో డిసెంబరు 14న నిర్వహించనున్న తెలంగాణ ప్రజాఫ్రంట్ జిల్లా మహాసభలను జయప్రదం చేయాలని ఆ సంఘం జిల్లా కో-కన్వీనర్ కావలి యాదయ్య, మండల కన్వీనర్ రాపోలు పవన్‌కుమార్ పిలుపునిచ్చారు. శుక్రవారం మండల కేంద్రంలో జిల్లా మహాసభల కరపత్రాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, కామ్రేడ్ బెల్లి లలిత ఆశయా సాధనలో ఏర్పాడు తెలంగాణ ప్రజాఫ్రంట్ రాష్ట్రంలో అనేక ఉద్యమాలు చేసిందన్నారు.

## 'విజయోత్సవాలకు సిద్ధం కావడం సిగ్గుచేటు'

ఆత్మకూరు(ఎం) నవంబరు 29 (ఆంధ్రజ్యోతి): ఎన్నికల ముందు ప్రజలకు హామీ ఇచ్చిన ఆరు గ్యారంటీలను పూర్తి స్థాయిలో అమలు చేయడం చేతగాని కాంగ్రెస్ ప్రభుత్వం విజయోత్సవాలకు సిద్ధం కావడం సిగ్గుచేటని బీజేపీ మండల అధ్యక్షుడు గజరాజ్ కాశీనాథ్ ఆరోపించారు. శుక్రవారం మండల కేంద్రంలో నిర్వహించిన బీజేపీ కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడారు. కాంగ్రెస్ ఏడాది పాలనలో గ్రామాల్లో అభివృద్ధి కుంటుపడిందన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వ వైఫల్యాలను ప్రజల్లో ఎండగట్టడానికి బీజేపీ ఆధ్వర్యంలో డిసెంబరు 1 నుంచి 5 వరకు గ్రామాల్లో బైక్ ర్యాలీలు, నిరసన కార్యక్రమాలు నిర్వహిస్తామన్నారు. సమావేశంలో జిల్లా స్పోక్ పర్సన్ బొబ్బల ఇంద్రారెడ్డి, కిసాన్‌మోర్చా జిల్లా కార్యదర్శి బి.సత్యనారాయణ పాల్గొన్నారు.

## వృద్ధులకు దుప్పట్ల పంపిణీ

మోత్కూరు, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి): చలి తీవ్రత ఎక్కువగా ఉండటంతో రాజమాత ఫౌండేషన్ ఆధ్వర్యంలో దాతల సహకారంతో పాటిమట్ల, దాచారం గ్రామాల్లో వృద్ధులకు, ఒంటరి మహిళలకు శుక్రవారం దుప్పట్లు పంపిణీ చేశారు. సుమారు 150 మందికి దుప్పట్లు అందించారు.

## టీడీపీకి పెరుగుతున్న ఆదరణ: నర్సింహగౌడ్

యాదగిరిగుట్ట రూరల్, నవంబరు 29, (ఆంధ్రజ్యోతి): తెలంగాణ రాష్ట్రంలో టీడీపీకి రోజు రోజుకు ఆదరణ పెరుగుతోందని టీడీపీ మండల అధ్యక్షుడు మచ్చ నర్సింహగౌడ్ అన్నారు. శుక్రవారం గుట్టలో టీడీపీ సభ్యత్వ నమోదు చేపట్టారు.

## లోక్ అదాలత్‌పై అవగాహన కల్పించాలి



సమీక్ష సమావేశంలో మాట్లాడుతున్న జడ్జి శిరీష

రామన్నపేట, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి): రాజీ పడదగిన కేసులపై కక్షిదారులకు అర్థమయ్యే విధంగా అవగాహన కల్పించాలని, డిసెంబరు 14న నిర్వహించే లోక్ అదాలత్‌లో వీలైనన్ని ఎక్కువ కేసులు పరిష్కారం అయ్యేలా పోలీస్ అధికారులు కృషి చేయాలని రామన్నపేట ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి ఎస్.శిరీష ఆదేశించారు. శుక్రవారం ఆమె కోర్టు ఆవరణలో న్యాయవాదులు పోలీస్ అధికారులతో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ కాంపౌండ్ క్రిమినల్ కేసులు, కుటుంబ తగాదాలు, మోటారు, బైక్ ప్రమాదాలు, చిట్‌ఫండ్ కేసులు పరాష్కారమయ్యేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో సర్కిల్ ఇన్స్‌పెక్టర్ ఎన్ వెంకటేశ్వర్లు, బార్ అసోసియేసన్ అధ్యక్షుడు ఎంఏ మాజీద్, రామన్నపేట, వలిగొండ, మోత్కూర్, అడ్డగూడూరు ఎస్ఐలు పాల్గొన్నారు.

## ఎస్సీ వర్గీకరణను అమలు చేయాలి

అడ్డగూడూరు, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో ఎస్సీ వర్గీకరణను వెంటనే అమలు చేయాలని ఎమ్మార్పీఎస్ ఉమ్మడి నల్లగొండ జిల్లా కో- ఆర్డినేటర్ బోడ సునీల్ అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. ఎస్సీ వర్గీకరణను దేశంలో మొట్ట మొదటిగా తెలంగాణ రాష్ట్రంలో అమలు చేస్తామని అసెంబ్లీ సాక్షిగా చెప్పిన ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఎస్సీ వర్గీకరణను ఆలస్యం ఎందుకు చేస్తున్నారో సమాధానం చెప్పాలని ఆయన డిమాండ్ చేశారు. ఎస్సీ వర్గీకరణను త్వరగా అమలు చేయడానికి ఉద్యమించాలని కోరారు. తదనంతరం ఎమ్మార్పీఎస్ మండల కమిటీ అధ్యక్షులుగా సూరారం రాజు, అధికార ప్రతినిధిగా పనుమటీ సతీష్, ప్రధానకార్యదర్శిగా బాలెంల నరేష్, ఉపాధ్యాక్షులుగా జాని, కార్యదర్శిగా రాఖేష్, తో పాటు కార్యవర్గన్ని ఎకగ్రీవంగా ఎన్నుకున్నారు. కార్యక్రమంలో కందుకూరి సోమన్న, నల్ల చంద్రస్వామి, సినియర్ నాయకులు బోడ యాదగిరి, బాలకృష్ణ పాల్గొన్నారు.

## ఆత్మగౌరవం కోసమే సింహగర్జన సభ

చౌటుప్పల్ రూరల్, నవంబరు 29(ఆంధ్రజ్యోతి): మాలల ఆత్మగౌరవం కోసమే సింహగర్జన సభ నిర్వహిస్తున్నామని మాల మహానాడు రాష్ట్ర నాయకులు చేపూరి నర్సింహ తెలిపారు. మాలల సింహగర్జన సభ విజయవంతం కోసం శుక్రవారం మండల పరిధిలోని వివిధ గ్రామాల్లో ప్రచారం నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆర్టికల్ 341కి వ్యతిరేకంగా సుప్రీం కోర్టు తీర్పు ఇచ్చిందని పేర్కొన్నారు. సుప్రీం కోర్టు తీర్పు రాజ్యాంగ విరుద్ధమన్నారు. రాబోయే రోజుల్లో రిజర్వేషన్లు రద్దు చేసే అవకాశం ఉందని ఆందోళన వ్యక్తం చేశారు. పార్లమెంట్‌లో చట్టబద్ధత కల్పించిన తర్వాతనే వర్గీకరణ చేయాలని డిమాండ్ చేశారు. సింహగర్జన సభ ఏ కులానికీ వ్యతిరేకం కాదని స్పష్టం చేశారు. మాలలు పెద్ద సంఖ్యలో తరలి వచ్చి సభను విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు ఎడ్ల లింగస్వామి, నాగరాజు, భాస్కర్, యాదయ్య, జువ్వి రఘుపతి పాల్గొన్నారు.

## 'సీపీఎం జిల్లా మహాసభలను విజయవంతం చేయాలి'

మోత్కూరు, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి): చౌటుప్పల్‌లో డిసెంబరు 15న నిర్వహించనున్న సీపీఎం జిల్లా మహాసభలను విజయవంతం చేయాలని ఆ పార్టీ జిల్లా కార్యదర్శివర్గ సభ్యుడు కల్లూరి మల్లేశం కోరారు. శుక్రవారం మోత్కూరు మునిసిపాలిటీలోని సుందరయ్య కాలనీలో జిల్లా మహాసభల సందర్భంగా నిర్వహించే బహిరంగ సభ కరపత్రాలను ఆయన విడుదల చేసి మాట్లాడారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల సందర్భంగా ప్రజలకు ఇచ్చిన హామీలు వెంటనే అమలు చేయాలని ఆయన డిమాండ్ చేశారు. బహిరంగ సభకు అన్నివర్గాల ప్రజలు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలన్నారు. కార్యక్రమంలో జిల్లా కమిటి సభ్యుడు బొల్లు యాదగిరి, మండల, పట్టణ కార్యదర్శులు గుండు వెంకటనర్సు, రాములమ్మ పాల్గొన్నారు.

# గోదావరి జలాలతో రైతుల కష్టాలు తొలగినట్టే



తోపుగాని చెరువు అలుగును పరిశీలిస్తున్న ప్రభుత్వ విప్ అయిలయ్య

యాదగిరిగుట్ట రూరల్, నవంబరు 29, (ఆంధ్రజ్యోతి): ఆలేరు నియోజకవర్గం గత కొన్ని సంవత్సరాలుగా సాగు, తాగునీరు లేక రైతులు, ప్రజలు అనేక కష్టాలు పడ్డారని గోదావరి జలాలతో కష్టాలు తొలగినట్లేనని ప్రభుత్వ విప్ బీర్ల అయిలయ్య అన్నారు. శుక్రవారం యాదగిరిగుట్ట మునిసిపాలిటీ పరిధిలోని తోపగాని చెరువు గోదావరి జలాలతో నిండి అలుగు పారడంతో చెరువు వద్ద కట్టమైసమ్మకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత ప్రభుత్వం ఈ ప్రాంతంలో నిర్మించిన బస్వాపురం రిజర్వాయర్ ద్వారా ఆలేరు, భువనగిరి, జనగామ ప్రాంతాలకు చుక్కనీరు ఇవ్వకుండా సూర్యాపేట జిల్లాకు తరలించి ఈ ప్రాంతాలకు తీరని అన్యాయం చేశారని ఆవేదన వ్యక్తం చేశారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఆదేశం మేరకు రాష్ట్రంలో రైతులకు నీరందించడానికి ఏ ప్రాజెక్టు ద్వారా ఉంటే వాటినుంచి రైతులకు చెరువులన్నీ నింపి వారి కష్టాలను తొలగించాలని ఆదేశించారని దాంట్లో భాగంగానే ఆలేరు నియోజకవర్గంలో ఇప్పటి వరకు 95శాతం చెరువులను నింపానని దీంతో భూగర్భ జలాలు పెరిగి బావులు, బోరుబావులు, గ్రామాల్లో ఇంటి బోర్లలోకి నీరు సంవృద్ధిగా వస్తోందని, దాంతో ప్రజలకు నీటి కష్టాలు ఉండవని చెప్పారు. జలయజ్ఞాని పూర్తిగా సహకరిస్తున్న మంత్రులు సీతక్క, కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి, తుమ్మల నాగేశ్వర్‌రావు, ఉత్తమ్‌కుమార్‌రెడ్డికి ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. అనంతరం విప్ ఇంటిదైవమైన సైదాపురం గ్రామ సమీపంలోని శ్రీవీరభద్రస్వామి ఆలయం ఎదుట స్థానిక మునిసిపల్ కౌన్సిలర్ బబ్బూరి మౌనికశ్రీధర్‌గౌడ్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వనబోజనాల కార్యక్రమంలో పాల్గొన్నారు. కార్యక్రమంలో స్థానిక మున్సిపల్ చైర్మన్ ఎరుకల సుధాహేమేందర్‌గౌడ్, మాజీ ఎంపీపీ చీర శ్రీశైలం, నాయకులు కానుగు బాలరాజ్‌గౌడ్, బందారపు భిక్షపతిగౌడ్, కౌన్సిలర్లు ముక్కెర్ల మల్లేష్‌యాదవ్, గుండ్లపల్లి వాణిభరత్‌గౌడ్, గౌళికార్ అరుణరాజేష్, కో ఆప్షన్ సభ్యుడు పేరబోయిన పెంటయ్య, నాయకులు దుంబాల వెంకట్‌రెడ్డి, శిఖ ఉపేందర్‌గౌడ్ ఎరుకల హే మేందర్‌గౌడ్, మిట్ట రాంగౌడ్, కీసరి బాలరాజుఖగౌడ్, ముక్కెర్ల వెంకటేష్, రాజు, శానిటరీ అధికారి కిరణ్ పాల్గొన్నారు.



సైదాపురంలో కార్తీక వనభోజనాల్లో పాల్గొన్న ప్రభుత్వ విప్ అయిలయ్య

# బీజేపీ నాయకుల ముందస్తు అరెస్టు




ఆలేరులో బీజేపీ నాయకులను అరెస్టు చేసిన పోలీసులు

ఆలేరు, మోటకొండూరు, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి): హైదరాబాద్‌లోని మాసాబ్ ట్యాంక్ సమీపంలోని దామోదరం సంక్షేమ భవన్ వద్ద బీజేపీ రాష్ట్ర కమిటీ తలపెట్టిన నిరసన కార్యక్రమం తలపెట్టిన సందర్భంగా పోలీసలు ఆలేరు మండలంలో ఆ పార్టీ నాయకులను ముందస్తు అరెస్టు చేసి పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. మధ్యాహ్నం వరకు అదుపులో ఉంచుకున్న పోలీసులు అనంతరం వారిని వ్యక్తిగత పూచీకతపై విడుదల చేశారు. ముందస్తు అరెస్టుయిన వారిలో పార్టీ మండల పట్టణ అధ్యక్షులు పూజారి కుమారస్వామి, నంద గంగేష్, నాయకులు తునికి దశరథ, కామిటికారి కృష్ణ, బందెల సుభాష్, ఐడియా శ్రీనివాస్, వడ్డెమాన్ కిషన్, నరేందర్, సందీప్, సంపత్ ఉన్నారు. అక్రమ అరెస్టులకు తాము భయపడేదిలేదని నాయకులు అన్నారు. అధికారంలోని కాంగ్రెస్ ప్రభుత్వం అవలంబిస్తున్న ప్రజావ్యతిరేక విధాలనాలను తీసుకువెళ్లేందుకు బీజేపీ చేపటుతున్న నాయకులు అడ్డుకొని అరెస్టుచేయడం అప్రజాస్వామికమన్నారు.

మోటకొండూరులో అరెస్టు అయిన వారిలో బీజేపీ మండల అధ్యక్షుడు తండ కృష్ణ, సీనియర్ నాయకుడు అనంతుల పాండురంగారెడ్డి, మల్లా లశోక్, ఆలేటి నాగరాజు, బాల్ద నర్సింహులు, శనిగరం ప్రదీప్ ఉన్నారు.

# భక్తిశ్రద్ధలతో సామూహిక సత్యనారాయణ వ్రతం



సత్యనారాయణ వ్రతంలో పాల్గొన్న భక్తులు

మోత్కూరు, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి): మోత్కూరు మండల, పట్టణ పద్మశాలి సంఘం ఆధ్వర్యంలో కార్తీక మాసం చివరి శుక్రవారం రోజు మోత్కూరు శ్రీసీతారామాంజనేయ స్వామి ఆలయంలో సామూహిక శ్రీసత్యనారాయణ వ్రతం నిర్వహించారు. కార్యక్రమంలో పూజారి పారునంది సూరిబాబు శర్మ, పద్మశాలి సంఘం మండల, పట్టణ అధ్యక్షులు మహేశ్వరం వెంకటేశ్వర్లు, పోచం బిక్షపతి, గుండు ప్రసాద్, పోచం కన్నయ్య, గంగుల రాములు, యాదగిరి, లక్ష్మణ్ పాల్గొన్నారు.

చౌటుప్పల్ టౌన్ : కార్తిక పౌర్ణమిని పురష్కరించుకుని శుక్రవారం చౌటుప్పల్ పట్టణంలోని శివభక్త మార్కండేయ స్వామి దేవాలయంలో పార్వతీ, పరమేశ్వరుల కల్యాణాన్ని వైభవంగా నిర్వహించారు. గణపతి పూజ, స్వస్తివాచనం, ధ్వజారోహణం, రుద్రహోమం నిర్వహించారు. కార్యక్రమాల్లో దేవాలయ అధ్యక్షుడు గోశిక నర్సింహ, చేనేత సహకార సంఘం మాజీ సెక్రటరీ గోశిక రవి లు పాల్గొన్నారు.